

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తోంది. వెలిగొండ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల రాష్ట్రానికి కీలక పరిణామంగా నిలిచింది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 04.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 135 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# కరువుకు.. కట్టడి! రైతుకు.. అండ!



- 52 శాతం లోటు వర్షపాతంపై ప్రభుత్వం అప్రమత్తం
- తక్కువ నీటితో పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహం
- మంత్రిమండలి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులను, ప్రజలను కరువు పరిస్థితుల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో ఒక్క ఎకరం కూడా పంట ఎండిపోకుండా చూడాలని, రైతులకు సాగునీరు అందించడంతో పాటు తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటల వైపు వారిని మళ్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అవసరమైన చోట్ల బోర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయం, తాగునీరు, పశుగ్రాసం, ఉద్యాన పంటల పరిరక్షణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కేబినెట్ నిర్ణయాలను అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**52 శాతం లోటు వర్షపాతం :** రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతంతో పోలిస్తే 52 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి పార్థసారథి తెలిపారు. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మొదటి రెండు స్థానాల్లో ఉందన్నారు. వర్షపాతం సాధారణ స్థాయిలో ఉండి ఉంటే ఈ సమయానికి రాష్ట్రంలో సుమారు 90 శాతం భూమి సాగులోకి వచ్చేదని, ప్రస్తుతం కేవలం 60 నుంచి 65 శాతం భూమి మాత్రమే సాగులోకి వచ్చిందని వివరించారు. వర్షాభావ పరిస్థితుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా అధిక నీటి అవసరం ఉన్న పంటల విషయంలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించి, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకునేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు.

2 లో

## వార్డుల పునర్విభజనకు హైకోర్టు ఓకే!



- పునర్విభజనను సవాలు చేసిన 53 పిటిషన్లు కొట్టివేత
- వార్డు ప్రత్యేక పరిపాలనా యూనిట్ కాదు : హైకోర్టు
- మున్సిపాలిటీ, కార్పొరేషన్ సరిహద్దుల్లో మార్పు ఉండదని స్పష్టీకరణ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మున్సిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్లు, నగర పంచాయతీల వార్డుల పునర్విభజనను సవాలు చేస్తూ దాఖలైన 53 పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. వార్డుల పునర్విభజనతో మున్సిపాలిటీ లేదా మునిసిపల్ కార్పొరేషన్ భౌగోళిక సరిహద్దుల్లో ఎలాంటి మార్పు ఉండదని జస్టిస్ నూనెపల్లి హరినాథ్ స్పష్టం చేశారు. మిగతా 2లో...

## ధరలకు.. కళ్లెం



- నిత్యావసరాల ధరల నియంత్రణకు మార్కెట్ జోక్యం
- కిలో ఉల్లిపాయలు రూ.35కే.. కందులు 1.20 లక్షల మెట్రిక్ టన్నులు కోరిన రాష్ట్రం
- పామాయిల్ సబ్సిడీ ధరలకు.. కేఎన్ఎం బియ్యం 10 వేల మెట్రిక్ టన్నుల సేకరణ

మిగతా 2లో...

## గురువులకు గౌరవ కిరీటం

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026 ప్రదానం
- విద్యారంగానికి విశేష సేవలందించిన 173 మందికి సత్కారం
- మెరిట్ సర్టిఫికెట్, పతకం, జ్ఞాపికతో పాటు రూ.20 వేల నగదు బహుమతి




**అమరావతి, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా సెప్టెంబరు 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం (గురుపూజోత్సవం) సందర్భంగా 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు-2026' ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. మిగతా 2లో...

## అక్టోబర్‌లోనే స్థానిక పోరు

- స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తే లేదు: లోకేష్
- మొదట మున్సిపల్.. ఆపై ఎంపీటీసీ, జెడ్పీటీసీ.. చివర పంచాయతీ ఎన్నికలు
- అక్టోబర్ నుంచే అర్హులకు దశలవారీగా కొత్త పింఛన్లు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ నాటికి పూర్తి చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర మంత్రులతో నిర్వహించిన సమావేశంలో స్థానిక ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ, శాఖల పనితీరుపై సుదీర్ఘంగా చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని లోకేష్ ఆదేశించారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిశీలించి, అర్హులకు పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు.

**క్రమపద్ధతిలో ఎన్నికలు :** మొదట పురపాలక సంస్థలు, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ

• వివరాలు 2 లో



## తిరుమల డిప్యూటీ ఈవో అరెస్టు!

- అక్రమ ఆస్తుల కేసులో లోకనాథాన్ని అదుపులోకి తీసుకున్న ఏసీబీ
- రూ.5 కోట్ల విలువైన ఆస్తులు.. 2 కిలోల బంగారం, 7 కిలోల వెండి స్వాధీనం
- రూ.12 లక్షల నగదు, కీలక ఆస్తి పత్రాలు స్వాధీనం

**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** టిటిడి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ లోకనాథంను అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం అరెస్టు చేశారు. మిగతా 2లో...



## కొండూరుకు జలధార

- కిడ్నీ బాధితుల కన్నీళ్లు తుడిచేలా రక్షిత తాగునీరు
- రూ.49.94 కోట్లతో 130 కి.మీ. పైప్‌లైన్ పూర్తి
- 38 ఆవాసాల్లో 75 వేల మందికి ఇంటింటికీ కుళాయిలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మూత్రపిండాల వ్యాధి (క్రానిక్ కిడ్నీ డిసీజ్) బారినపడిన ప్రజలతో మరో ఉద్ధానాన్ని తలపించే ప్రాంతం ఎన్టీఆర్ జిల్లా, ఎ.కొండూరు మండలం. ఈ మండల పరిధిలో మొత్తం 21 గ్రామ పంచాయతీలు, 38 ఆవాసాలు ఉండగా, దాదాపు అన్ని గ్రామాలు దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. మిగతా 2లో...

## జిఎస్ఎల్‌వి -ఎఫ్ 17 కౌంట్‌డౌన్



**సూళ్లూరుపేట (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీహరికోట భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి జిఎస్ఎల్‌వి-ఎఫ్17 రాకెట్ ద్వారా ఇఒఎస్-05 ఉపగ్రహాన్ని నింగిలోకి పంపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మిగతా 2లో...

## లాజిస్టిక్స్.. ఏవియేషన్.. ఏపీకి కొత్త ఊపిరి!



- రూ.300 కోట్ల పెట్టుబడులకు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ ఆసక్తి
- భోగాపురం, కర్నూలు, విజయవాడలో ఎంఆర్‌ఓ కేంద్రాలు
- స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు

**అమరావతి, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులకు ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. సుస్థిర ప్రభుత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం నెలకొందని మంత్రి పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో నేడు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ డైరెక్టర్ వివేక్ అగర్వాల్, ప్రతినిధుల బృందం మంత్రిని కలిసి రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించింది. రాష్ట్రంలోని వివిధ పోర్టుల్లో సరుకు నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, రైల్వే లింక్డ్ మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌లను అభివృద్ధి చేసేందుకు సంస్థ ప్రతినిధులు తమ ఆసక్తిని మిగతా 3లో...

# కరువుకు.. కట్టడి! రైతుకు.. అండ!

(మొదటి పేజీ తరువాయి)

**ఆరుతడి పంటల సాగుపై ప్రత్యేక దృష్టి :** ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి లభ్యత తగ్గే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు మంత్రి తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు వాటిపై సబ్సిడీ కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఆరుతడి పంటల కోసం 90 వేల కిలోల విత్తనాలను పంపిణీకి సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని, విత్తనాల సబ్సిడీ కోసం రూ. 90 కోట్ల ఆర్థిక సాయానికి ఆయన ఆమోదం తెలిపారని పార్థసారథి వెల్లడించారు.

వరి సాగుకు అధిక మొత్తంలో సాగునీరు అవసరమవుతుందని, ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో నీటి లభ్యతను బట్టి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు బలవంతంగా పంట మార్పిడి చేయడం కాకుండా, నీటి లభ్యత, పంట దిగుబడి, మార్కెట్ అవకాశాలు, ఆదాయంపై అవగాహన కల్పించి నిర్ణయం తీసుకునేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

**క్షేత్రస్థాయిలో అధికారులు :** ఎల్‌నినో ప్రభావాన్ని రైతులకు వివరించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం ఆదేశించినట్లు పార్థసారథి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులతో నేరుగా సమావేశాలు నిర్వహించి పంటల మార్పిడిపై సూచనలు ఇవ్వాలని చెప్పారు.

జిల్లాల్లోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ కళాశాలల అధ్యాపకుల సహకారంతో తక్కువ నీటి వనరులతో లాభదాయకమైన పంటల సాగుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే పంటలపై రైతులకు మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారన్నారు.

**పశుగ్రాస కొరత లేకుండా చర్యలు :** వర్షాభావ పరిస్థితులు పశుసంపదపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉన్నందున పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. జీ రామ్ జీ కార్యక్రమం భాగస్వామ్యంతో పశుగ్రాసం పెంపకానికి చర్యలు చేపట్టాలని సూచించినట్లు మంత్రి తెలిపారు.

పశువులకు అవసరమైన మేత అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా పరిస్థితిని అంచనా వేసి అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు



చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.

**ఉద్యాన పంటల పరిరక్షణకు చర్యలు :** ఉద్యాన పంటలను కూడా వర్షాభావ ప్రభావం నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు నిరంతర నీటి సరఫరా అవసరమయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ నీటి వనరులను వినియోగించుకోవాలని సీఎం సూచించినట్లు చెప్పారు.

అవసరమైన చోట్ల సమీపంలోని చెరువుల నుంచి కాలువల ద్వారా నీటిని తరలించడం, బిందు సేద్యం వంటి నీటి పొదుపు పద్ధతులను ప్రోత్సహించడం, రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించడం వంటి చర్యలను చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు.

**14,829 ఆవాసాలకు తాగునీటి ప్రణాళిక :** వర్షాభావ పరిస్థితులు కొనసాగితే తాగునీటి సమస్య కూడా తలెత్తే అవకాశం ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 14,829 ఆవాసాలు ఉన్నాయని, ప్రతి నివాస ప్రాంతానికి సంబంధించి ప్రత్యేకంగా నీటి లభ్యతను అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు.

ప్రజలకు తాగునీరు అందించేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లు వేయడం, నీటి వనరులను వినియోగించడం, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం వంటి చర్యలు చేపట్టాలని సీఎం సూచించారన్నారు.

పరిస్థితి తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి ట్యాంకర్లను అద్దె ప్రాతిపదికన తీసుకొచ్చి తాగునీటి సరఫరా చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోందని పార్థసారథి తెలిపారు.

**కేంద్రం నుంచి కరువు నిధుల కోసం ప్రయత్నాలు :** రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు వివరించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, వ్యవసాయంపై పడుతున్న ప్రభావం తదితర అంశాలతో కేంద్రానికి లేఖలు పంపాలని సూచించినట్లు చెప్పారు.

వాతావరణ ఆధారిత బీమా అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానంలో ఉందని పార్థసారథి తెలిపారు. కేంద్రం, రాష్ట్రం, జీ రామ్ జీ నిధులను సమన్వయం చేసుకుని కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన కార్యాచరణను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు.

కరువు పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ ఆర్థిక సహాయం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన నివేదికలు, ప్రతిపాదనలు సిద్ధం చేయనుందని తెలిపారు.

తిరుపతి నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీను తరలిస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అధునాతన సాంకేతిక రంగాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అమరావతిలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో మూడు విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు అనుమతులు లభించాయని మంత్రి వివరించారు.

**నెల్లూరు జిల్లాలో 22.31 ఎకరాల భూమి వర్గీకరణ మార్పు :** కేబినెట్ సమావేశంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 18వ అంశంపై కూడా నిర్ణయం తీసుకున్నారు. ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా నెల్లూరు అర్బన్ మండలంలోని సర్వేపల్లి కాలువ పరిధిలో మొత్తం 62.70 ఎకరాల భూమిలో 22.31 ఎకరాలను 'కెనాల్ పోరంబోకు' నుంచి 'ఆ. ఔ. ణతీఎ'గా వర్గీకరణ మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

జాయింట్ కమిటీ సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే క్రియాశీల కాలువ ప్రాంతం, హైడ్రాలిక్ ఆపరేషనల్ జోన్, తప్పనిసరి 20 అడుగుల ఇరిగేషన్ రైట్ ఆఫ్ వే (=శీఔ) బఫర్ ప్రాంతాలను ఈ మార్పు నుంచి మినహాయించారు.

కాలువ నీటి ప్రవాహ సామర్థ్యానికి, నిర్వహణ హక్కులకు ఎలాంటి ఆటంకం కలగకుండా రక్షణ చర్యలు కొనసాగిస్తూ, అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థల పట్టాలు జారీ చేసేందుకు కేబినెట్ అనుమతించింది.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో రైతులకు సాగునీరు, తక్కువ నీటితో పంటల సాగు, పశుగ్రాసం, ఉద్యాన పంటల పరిరక్షణతో పాటు ప్రజలకు తాగునీటి సరఫరాకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. వర్షాభావ పరిస్థితులు మరింత తీవ్రతరం కాకముందే అవసరమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని, క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మేరకు నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని మంత్రి వివరించారు.

## అక్టోబర్‌లోనే స్థానిక పోరు

(మొదటి పేజీ తరువాయి)



ఎన్నికలు నిర్వహిస్తామని లోకేశ్ తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందన్నారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు ఫలించవని పేర్కొన్నారు. కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం కలిగించాలనే ఉద్దేశంతో వైసీపీ 'గొడ్డలి రాజకీయాలు' చేస్తోందని లోకేశ్ విమర్శించారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**సోషల్ మీడియా ట్రోలింగ్‌పై అప్రమత్తత :** విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు చేస్తున్న ప్రచారం, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరించే, ఆదేశాలను పాటించని అధికారులపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ప్రగతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి :** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు నమోదు చేసి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సెప్టెంబర్ 9న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. గత ప్రభుత్వ కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు.

**నీటి పొదుపుపై ముందస్తు చర్యలు :** ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని లోకేశ్ మంత్రులకు సూచించారు. నీటి వినియోగంలో పొదుపు పాటించేలా కార్యాచరణ రూపొందించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## తిరుమల డిప్యూటీ ఈవో అరెస్టు!

(మొదటి పేజీ తరువాయి)



అక్రమ ఆస్తుల కేసులో లోక్‌నాథం, ఆయనతో సంబంధం ఉన్న పలువురి ఇళ్లలో ఎసిబి అధికారులు బుధవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. గురువారం కూడా సోదాలు కొనసాగాయి. ఆస్తి పత్రాలు, బంగారం, వెండి, నగదుతో సహా కీలకమైన ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో ఆయన నివాసం నుంచి లోకనాథంను ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం విచారణ నిమిత్తం నెల్లూరు ఎసిబి కార్యాలయానికి తరలించారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యి కల్తీ చేశారనే వ్యవహారంపై సిబిఐ జరిపిన దర్యాప్తులో వెల్లడైన సమాచారం ఆధారంగా లోకనాథం నివాసంపై సోదాలు జరిగాయని ఎసిబి వర్గాలు తెలిపాయి. తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారనే ఆరోపణలపై సిబిఐ దర్యాప్తులో టిటిడికి చెందిన కొందరు ఉద్యోగులకు సంబంధించిన వివరాలు బయటపడ్డాయి. దీంతో పలువురిపై సిబిఐ నేతృత్వంలోని సిట్ కేసు నమోదు చేయగా, మరికొందరి పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేసింది. వారిపై విచారణ జరిపించాలని ప్రభుత్వానికి సూచించింది. నెయ్యి సరఫరాదారులను ప్రభావితం చేశారన్న ఆరోపణలపై, అప్పటి టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి వద్ద గతంలో వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన కె. చిన్న అప్పన్నపై ఎసిబి విశాఖపట్నం విభాగం కేసు నమోదు చేసింది. ఈ దర్యాప్తునకు కొనసాగింపుగా ఎసిబి అధికారులు లోకనాథం వ్యవహారంపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఎసిబి అధికారులు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. తిరుపతిలోని లోకనాథం నివాసం, నగరంలోని ఆయన బంధువులలో ఒకరి ఇల్లు, ఏర్పేడులోని ఆయన పూర్వీకుల ఇల్లు, తిరుమలలోని ఆయన అధికారిక కార్యాలయంపై ఏకకాలంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల సందర్భంగా లోకనాథం కుటుంబ సభ్యుల పేర్లతో అక్రమంగా సంపాదించినట్లు భావిస్తున్న పలు ఆస్తుల వివరాలు వెల్లడయ్యాయని ఎసిబి ఒక ప్రకటనలో తెలిపింది. సోదాల సందర్భంగా లోకనాథం ఇంట్లో రూ. ఐదు కోట్ల విలువైన ఆస్తులు, రెండు కిలోల బంగారం, ఏడు కిలోల వెండి, రూ. 12 లక్షల నగదును ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## ధరలకు.. కళ్లెం

**అమరావతి, సెప్టెంబర్ 3(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల నేపథ్యంలో వినియోగదారులపై భారం పడకుండా చేపట్టాల్సిన మార్కెట్ జోక్య చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం గురువారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికే అమలు చేస్తున్న బియ్యం మార్కెట్ జోక్య కార్యక్రమానికి అదనంగా ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్‌పై తక్షణమే మార్కెట్ జోక్య చర్యలు చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ధరల పెరుగుదల ప్రభావం సామాన్య ప్రజలపై పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ జోక్య చర్యలను సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన కీలక నిత్యావసర వస్తువుల కేటాయింపుపై కేంద్ర ప్రభుత్వంతో పౌరసరఫరాల శాఖ నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులు సూచించారు.

**కిలో ఉల్లిపాయలు రూ.35కే :** వినియోగదారులకు కిలో ఉల్లిపాయలను రూ. 35కే అందించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ఉల్లిపాయల నిల్వలను రాష్ట్రానికి కేటాయించే అంశాన్ని జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య దృష్టికి తీసుకెళ్లాలని సూచించింది. కేంద్రం నుంచి కేటాయించిన నిల్వలను రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందుల కేటాయింపునకు విజ్ఞప్తి :** కందిపప్పు ధరల నియంత్రణకు కూడా మార్కెట్ జోక్యం చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఇందులో భాగంగా 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కందులను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖను కోరారు. వాటిని ప్రాసెసింగ్ చేసి రైతు బజార్లు, ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరలకు కందిపప్పుగా వినియోగదారులకు అందించేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

**పామాయిల్‌ను సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు :** పామాయిల్ ధరల పెరుగుదలను నియంత్రించేందుకు తక్షణ మార్కెట్ జోక్యం చేపట్టాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్య ద్వారా పామాయిల్ సేకరించే అవకాశాలను పరిశీలించాలని



అధికారులను ఆదేశించింది. జాతీయ సహకార వినియోగదారుల సమాఖ్యతో సమన్వయం చేసుకుని అవసరమైన పామాయిల్‌ను సమకూర్చి వినియోగదారులకు సబ్సిడీ ధరలకు అందించేలా చర్యలు చేపట్టాలని సూచించింది.

**651 ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం విక్రయాలు :** బియ్యం ధరల పెరుగుదలను కట్టడి చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 651 ప్రత్యేక కౌంటర్లు, రైతు బజార్ల ద్వారా మార్కెట్ జోక్య కార్యక్రమం అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 10,163 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, దాదాపు లక్ష మంది వినియోగదారులు ప్రయోజనం పొందారు.

వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడే కేఎన్ఎం రకం బియ్యాన్ని నెల్లూరు జిల్లాలోని బియ్యం మిల్లర్ల నుంచి 10,000 మెట్రిక్ టన్నులు సేకరించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఈ బియ్యాన్ని ప్రత్యేక కౌంటర్ల ద్వారా సరసమైన ధరకు విక్రయించడం ద్వారా పెద్ద మొత్తంలో బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వినియోగదారులకు ధరల భారం నుంచి ఉపశమనం కల్పించాలని నిర్ణయించింది.

ఉల్లిపాయలు, కందిపప్పు, పామాయిల్, బియ్యం సహా నిత్యావసర వస్తువుల ధరలు, నిల్వలు, సరఫరాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కృత్రిమ కొరతకు అవకాశం లేకుండా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. సామాన్య ప్రజలకు నిత్యావసరాలు అందుబాటు ధరల్లో లభించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొండూరుకు జలధార

(మొదటి పేజీ తరువాయి)

అందులో గిరిజనులు మాత్రమే నివసించే 15 తండాలున్నాయి. తాగేందుకు గుక్కెడు నీరు దొరక్క, ప్రమాదమని తెలిసినా కలుషిత జలాలతో గొంతు తడుపుకునే పరిస్థితి నెలకొంది.

2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ సమస్య పవన్ కళ్యాణ్ దృష్టికి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎ.కొండూరుకు రక్షిత తాగునీటి సౌకర్యం కల్పించడం ద్వారా ఆ ప్రాంత ప్రజలను కిడ్నీ వ్యాధి బారి నుంచి కాపాడాలని సంకల్పించారు. అధికారం చేపట్టిన 26 నెలల్లోనే తన పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ ద్వారా జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల నిధులతో ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశారు. రూ. 49.94 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు 100 శాతం పనులు పూర్తి చేసుకుని ఆ ప్రాంత ప్రజల నీటి కష్టాలను తీర్చింది.

**గత ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ కూడా మొదలుపెట్టలేదు :** ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టును కూడా గత ప్రభుత్వం ఆర్భాటం చేసి, కనీసం టెండర్ ప్రక్రియను కూడా మొదలుపెట్టలేదు. ఒక్క పనీ ప్రారంభించలేదు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన ప్రాజెక్టు కావడం, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 2024 మార్చి నాటికి గడువు కూడా ముగియడంతో ఈ ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప



ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ పనులను ముందుకు తీసుకెళ్లారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను మరో నాలుగేళ్లు పొడిగించగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా కూడా తక్షణమే విడుదల చేసి, పనులను యుద్ధప్రాతిపదికన ముందుకు తీసుకువెళ్లింది.

కిడ్నీ వ్యాధితో ప్రజలు పడుతున్న అవస్థలను చూసి చలించిన ఉప ముఖ్యమంత్రి, నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయించారు. ఇబ్రహీంపట్నం ఎన్టీపీసీ కాలువ నుంచి కృష్ణా జలాలను స్వీకరించి, అక్కడే శుద్ధి చేసి, 130 కిలోమీటర్ల పైప్‌లైన్, 12 ఓవర్‌హెడ్ ట్యాంకుల సహకారంతో దాదాపు 75,000 మందికి ఒక్కొక్కరికి రోజుకు 55 లీటర్ల చొప్పున స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నారు.

ఎ.కొండూరు తాగునీటి ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన పవన్ కళ్యాణ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, అటవీ, పర్యావరణ, రైల్వే శాఖలతో పాటు నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులతో సమన్వయం చేసుకుంటూ, పైప్‌లైన్ నిర్మాణానికి అత్యంత త్వరితగతిన అనుమతులు లభించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లారు.

గతంలో ఎ.కొండూరు మండల పరిధిలోని ప్రజలకు ట్యాంకర్ల సాయంతో తాగునీరు అందించేందుకు ప్రభుత్వం ఏటా రూ. 2.5 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చేది. నేడు పవన్ కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధతో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధారల రూపంలో తాగునీటి సమస్యకు, తద్వారా కిడ్నీ సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం లభించినట్టయింది.

త్వరలో ఎ.కొండూరు ప్రాంతంలో పర్యటించి తాగునీటి పథకం పనుల నాణ్యతను ఉప ముఖ్యమంత్రి పరిశీలించనున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఇప్పటికే కార్యాలయ అధికారులకు నిర్దేశం చేశారు.



## గురువులకు గౌరవ కిరీటం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా విద్యా రంగానికి విశేష సేవలు అందించిన ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నారు. వివిధ విభాగాలకు చెందిన మొత్తం 173 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు ఈ అవార్డులు అందజేయనున్నారు. వీరిలో పాఠశాల విద్య విభాగంలో 79, ఇంటర్మీడియట్ విద్యలో 24, సాంకేతిక విద్యలో 14, ఉన్నత విద్యలో 56 మంది ఉన్నారు. ఉన్నత విద్య విభాగంలో యూనివర్సిటీల నుంచి 35, డిగ్రీ కళాశాలల నుంచి 15, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల నుంచి ఆరుగురు చొప్పున ఎంపికయ్యారు.

## వార్డుల పునర్విభజనకు హైకోర్టు ఓకే!

(మొదటి పేజీ తరువాయి)

పరిపాలనా ఉత్తర్వులు జారీ చేయడానికి మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్‌నే పరిపాలనా యూనిట్‌గా పరిగణించాలని తెలిపారు. పన్నుల వసూలు, అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, మంచి నీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి కార్యకలాపాలన్నీ మునిసిపాలిటీ లేదా కార్పొరేషన్ ద్వారానే జరుగుతాయని పేర్కొన్నారు. ఒక్క వార్డుకు ప్రత్యేక పరిపాలనా కార్యాలయం, స్వతంత్ర చట్టబద్ధ అధికారాలు ఉండవని, వార్డు పేరుతో పన్నులు వసూలు చేయడం లేదా రసీదులు జారీ చేయడం జరగదని తెలిపారు. అందువల్ల వార్డును ప్రత్యేక పరిపాలనా యూనిట్‌గా పరిగణించలేమని తేల్చిచెప్పారు. పరిపాలనా యూనిట్ల సరిహద్దులను ఫ్రీజ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ జనాభా లెక్కల సేకరణకు మాత్రమే వర్తిస్తుందని, దాన్ని వార్డుల పునర్విభజనకు వర్తింపజేయలేమని న్యాయమూర్తి తెలిపారు. ప్రతి మునిసిపాలిటీ, కార్పొరేషన్‌కు స్పష్టమైన భౌగోళిక సరిహద్దులు, ప్రత్యేక అధికార పరిధి ఉంటాయని పేర్కొన్నారు. జనాభా లెక్కల ప్రక్రియకు, స్థానిక ఎన్నికల ఓటింగ్‌కు సంబంధం లేదని, ప్రభుత్వం జారీ చేసే కొత్త నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు తెలిపే అవకాశం పిటిషనర్లకు ఇంకా ఉందని చెప్పారు.

## జిఎస్ఎల్‌వి -ఎఫ్ 17 కౌంట్‌డౌన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రయోగానికి సంబంధించిన 27.5 గంటల కౌంట్‌డౌన్ ప్రక్రియ బుధవారం రాత్రి 11:25 గంటలకే ప్రారంభమై, ప్రస్తుతం సజావుగా సాగుతోంది. శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు రాకెట్‌ను ప్రయోగించనున్నారు. వాతావరణ పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, వ్యవసాయం తదితర రంగాలకు అవసరమైన సమాచారాన్ని అందించడంలో ఈ ఉపగ్రహం సహాయపడనుంది. ప్రయోగానికి ముందు చివరి దశలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా శాస్త్రవేత్తలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే నిర్ణీత సమయానికి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది.

## ఉపాధ్యాయ దినోత్సవం రోజున

- **ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షలు రద్దు చేయాలి: ఆప్టా**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నిర్వహణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలియజేయాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహదీ పిలుపునిచ్చారు. ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్షల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ లోకం అనేక సందర్భాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఈ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు.

ఎఐపిటీఎఫ్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోనూ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. కోర్టు తీర్పును సాకుగా చూపకుండా ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షలు రద్దు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టెట్ పరీక్షలపై ఉపాధ్యాయుల్లో ఉన్న అభ్యంతరాలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, సమస్య పరిష్కారం కోసం ఉపాధ్యాయుల ఐక్యతను చాటేలా ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆప్టా నాయకులు తెలిపారు.

రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఈ ఉద్యమానికి కలిసి వచ్చి తమ నిరసనను తెలియజేయాలని వారు కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ పరిష్కారమయ్యే వరకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

# కూటమి పాలన.. అభివృద్ధి పరుగులు.. సంక్షేమం ఇంటింటికీ!

## స్వర్ణయుగాన్ని తలపిస్తున్న చంద్రబాబు పాలన

## ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్








**తెనాలి, సెప్టెంబరు 3 (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'రెండేళ్ల నమ్మకం–అభివృద్ధి–సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమం తెనాలి పట్టణంలో ఉత్సాహంగా సాగింది. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ 38, 6వ వార్డుల్లో కూటమి నాయకులు, అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు.

ఇంటింటికీ వెళ్లిన ఆలపాటి.. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదే సమయంలో స్థానిక ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, చేపడుతున్న అభివృద్ధిపై ప్రజల నుంచి స్పందనను తెలుసుకున్నారు.

**'అభివృద్ధి.. సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట' :** ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని అన్నారు. దేశంలోనే వినూత్న రీతిలో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.

చంద్రబాబు నాయకత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్నాయని, వెలిగొండ ప్రాజెక్టుతో పాటు పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా నీటిని విడుదల చేయడం రాష్ట్రానికి కీలక పరిణామమని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

**యువతకు ఉద్యోగాలు.. పరిశ్రమలకు పునరాగమనం :** గత పాలనలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలను తిరిగి తీసుకురావడంతో పాటు కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆలపాటి తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని, వివిధ స్థాయుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ పనిచేస్తున్నారని చెప్పారు.

**రైతు.. మహిళ.. విద్యార్థి.. ప్రతి కుటుంబానికి అండ :** వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఆలపాటి అన్నారు. రైతు భరోసా, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలతో రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు.

తల్లికి వందనం, దీపం పథకం ద్వారా ఉచిత గ్యాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తూ, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని అన్నారు.

**లి'చంద్రబాబు పాలన స్వర్ణయుగం' :** కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో వేగంగా ముందుకు సాగుతోందని, ఆయన పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు నాయకులు, అధికారులు నిరంతరం ప్రజల్లో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైన ఏపీ జేఏసీ అమరావతి 'డిమాండ్స్ డే'




**విజయవాడ, సెప్టెంబరు 3:** రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న పెండింగ్ ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన 'డిమాండ్స్ డే' కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమయ్యాయని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, డివిజన్లు, హెచ్‌ఓడీ కార్యాలయాల వద్ద ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని "మా బకాయిలు మాకు చెల్లించాలి.. మా హక్కులు మాకు కల్పించాలి" అంటూ నినాదాలు చేశారు. ఉద్యోగుల సమస్యలు కొత్తగా వచ్చినవి కావని, గత కొంతకాలంగా ప్రభుత్వం దృష్టిలో ఉన్నవేనని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీల అమలునే ఉద్యోగులు కోరుతున్నారని వారు స్పష్టం చేశారు. డీఏ బకాయిలు, పీఆర్సీకి సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు, వేల కోట్ల పెండింగ్ బిల్లులు, సరెండర్ లీవులు, రిటైర్డ్, మృతిచెందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర ఆర్థిక ప్రయోజనాలను ఇకపై వాయిదా వేయడం సరికాదన్నారు. సుమారు పదేళ్లుగా జీతభత్యాలకు సంబంధించిన బకాయిలు అందకపోవడంతో అనేకమంది పెన్షనర్లు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉద్యోగుల కుటుంబాలకు రావాల్సిన ప్రయోజనాల విషయంలోనూ ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చట్టబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందకపోయినా రెండున్నరేళు ్లగా ఉద్యోగులు ప్రభుత్వానికి సహకరిస్తూనే ఉన్నారని, ఉద్యోగుల సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. ఉద్యోగుల ఆర్థిక సమస్యల పరిష్కారంలో ఇక జాప్యాన్ని సహించలేమని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వ ఉద్యోగులను నియమించుకున్న ప్రభుత్వం, వారికి న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను నిలిపివేయడం సరికాదన్నారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకులు కాదని, తమ కష్టార్జితానికి సంబంధించిన హక్కులు, న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలనే కోరుతున్నారని తెలిపారు. ఉద్యమం మరింత ఉధృతం కాకముందే ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో వెంటనే చర్చలు జరిపి, పెండింగ్ సమస్యల పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం, కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరిస్తే సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, జాప్యం కొనసాగితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయక తప్పదని హెచ్చరించారు. 'డిమాండ్స్ డే'కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో స్పందించడం ఉద్యమానికి లభిస్తున్న మద్దతుకు నిదర్శనమన్నారు. "మా డబ్బులు మాకు ఇవ్వాలి.. మా హక్కులు మాకు కల్పించాలి" అనే న్యాయమైన డిమాండ్‌తో కొనసాగుతున్న పోరాటంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఉద్యోగుల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇవ్వాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్రకమిటీ నేతలు బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు, టి. వి. ఫణి పేర్రాజు, తిమ్మసర్తి నాగేశ్వరరావు, పారే లక్ష్మి, పొన్నూరు విజయలక్ష్మి కోరారు.

## లాజిస్టిక్స్.. ఏవియేషన్.. ఏపీకి కొత్త ఊపిరి!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రికి వివరించారు.

**ఏపీలో రూ.300 కోట్ల పెట్టుబడులకు శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ ఆసక్తి :** సుమారు 30 ఏళ్ల అనుభవం, రూ. 1,500 కోట్ల టర్నోవర్ కలిగిన శ్రీక్షేత్ర లాజిస్టిక్స్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో సుమారు రూ. 300 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిందని మంత్రి తెలిపారు. రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, గుజరాత్ రాష్ట్రాల్లో లాజిస్టిక్స్ రంగంలో సేవలందిస్తున్న సంస్థ, ఏపీలో పోర్టులు, రైల్వే కనెక్టివిటీ, మల్టీ మోడల్ లాజిస్టిక్స్ హబ్‌ల అభివృద్ధికి అవకాశాలను పరిశీలిస్తోంది.

లాజిస్టిక్స్ రవాణా ఖర్చులను తగ్గించడంతో పాటు రాష్ట్రంలో రవాణా, మౌలిక వసతులు, లాజిస్టిక్స్ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిలిఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ–లింక్)లిలిపై సంస్థ ప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు. పెట్టుబడుల ఆకర్షణకు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న విధానపరమైన నిర్ణయాలు, అందిస్తున్న ప్రోత్సాహకాలను వారు అభినందించారు.

పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు వస్తే ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. మంత్రితో జరిగిన చర్చలు సానుకూలంగా సాగడంపై సంస్థ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

**ఏపీలో ఏవియేషన్ రంగానికి భారీ అవకాశాలు :** అదేవిధంగా, మెల్‌స్టార్ ఏవియేషన్ సంస్థ డైరెక్టర్ తరుణ్ కశ్యప్ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఏవియేషన్ రంగంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. కర్నూలు విమానాశ్రయంలో ఏర్పాటు చేస్తున్న లిలిమెల్‌స్టార్ ఏవియేషన్ లెర్నింగ్ అకాడమీ (మాలా)లిలిలో పైలట్ శిక్షణ కేంద్రం పురోగతిని సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఈ శిక్షణ కేంద్రానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు.

విజయవాడ విమానాశ్రయంలో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ (ఏఎంఈ) శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. అంతేకాకుండా భోగాపురం, కర్నూలు, విజయవాడ విమానాశ్రయాల్లో పూర్తి స్థాయి మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ) కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది.

రాష్ట్రంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విమానాశ్రయాల విస్తరణతో పాటు ఎంఆర్ఓ, ఏఎంఈ, పైలట్ శిక్షణ వంటి అనుబంధ రంగాల్లో భారీ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రి తెలిపారు. ముఖ్యంగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతో పాటు విమానయాన రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.

**నూతన ఏవియేషన్ పాలసీపై ప్రశంసలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఏవియేషన్ పాలసీ పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులు ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ప్రముఖ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఏవియేషన్ రంగానికి పెరుగుతున్న డిమాండ్, అందుబాటులోకి వస్తున్న ఆధునిక విమానాశ్రయాలు, అనుకూలమైన పారిశ్రామిక విధానాలతో గ్లోబల్ స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి ఆకర్షితమవుతున్నాయని పేర్కొన్నారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలతో ముందుకు రావాలని మెల్‌స్టార్ ఏవియేషన్ ప్రతినిధులను మంత్రి కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ రంగ అభివృద్ధికి, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

ఎంఆర్ఓ, ఏఎంఈ, పైలట్ శిక్షణ వంటి రంగాల ద్వారా స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని మంత్రి తెలిపారు. పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతులు, అనుకూలమైన విధానాలు, అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అత్యంత అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

## పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రహదారి పనులకు కదలిక



**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** గత పదేళు ్లగా పెండింగ్‌లో ఉన్న తెనాలి–చందోలు (కూచిపూడి) రహదారి నిర్మాణ పనులకు ఎట్టకేలకు కదలిక వచ్చింది. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రత్యేక చొరవతో నిలిచిపోయిన పనులు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా కొనసాగుతున్నాయి. తెనాలి–చందోలు రహదారిలో ఇరువైపులా జంగల్ క్లియరెన్స్ పనులు పూర్తికాగా, ప్రస్తుతం డిగ్గింగ్ పనులు జరుగుతున్నాయి. పెదరావూరు నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ. 2 కోట్ల వ్యయంతో పనులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాని పరిస్థితిని అధిగమించేందుకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు స్వయంగా కాంట్రాక్టర్లతో చర్చించి పనులు ప్రారంభించేలా ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు.

ఇదే విధంగా అంగలకుదురు––నడిగడ్డపాలెం రహదారి నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని ఆర్‌అండ్‌బీ అధికారులు వెల్లడించారు.

రహదారి పనుల పురోగతిపై ఎమ్మెల్యే అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారుల దుస్థితి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యమే లక్ష్యంగా రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఎస్ఆర్ఎం వర్సిటీలో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

- **9 మంది ప్రొఫెసర్లకు 'బెస్ట్ ఫ్యాకల్టీ' అవార్డులు**
- **డాక్టర్ వీఎం మణికందన్ కు హెచ్‌పీ తివారీ పురస్కారం**



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ముందస్తు టీచర్స్ డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రా యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం టీచర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమని ఆచార్య జీపీ రాజశేఖర్ అన్నారు. మంచి ఉపాధ్యాయుడు కేవలం పాఠాలను బోధించడమే కాకుండా విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులేనని, విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల త్యాగం ఎంత ముఖ్యమో, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా అంతే కీలకమని అన్నారు. ఇలాంటి మహత్తరమైన రోజున అధ్యాపకులను ప్రోత్సహిస్తూ అవార్డులు అందించడం అభినందనీయమని పేర్కొంటూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉప కులపతిగా పనిచేసిన ఆంధ్రా యూనివర్సిటీ ప్రస్తుత వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్‌ను ఈ వేదికపై సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

**9 మంది ప్రొఫెసర్లకు బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డులు...**

టీచర్స్ డే సందర్భంగా బోధనా రంగంలో విశేషమైన సేవలందిస్తున్న 9 మంది ప్రొఫెసర్లకు 2026 సంవత్సరానికి గాను యూనివర్సిటీ అవుట్‌స్టాండింగ్ బెస్ట్ ఫ్యాకల్టీ అవార్డులను ప్రకటించారు. ఈ అవార్డులకు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ రామాంజనేయరెడ్డి, డాక్టర్ అనూజ్ దేశ్‌పాండే, డాక్టర్ మంజీష్ కుమార్, డాక్టర్ ఎలక్కియా, డాక్టర్ సిద్ధార్థ ఘోష్, డాక్టర్ దేబజ్యోతి కుందు, డాక్టర్ ఆయేషా పర్వీన్, డాక్టర్ సలేటి సుమలత ఎంపికయ్యారు. అవార్డులు అందుకున్న ఒక్కొక్కరికి రూ. 50 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అందజేశారు.

**డాక్టర్ వీఎం మణికందకు హెచ్‌పీ తివారీ పురస్కారం**

బోధన, పరిశోధన రంగాల్లో విశేషకృషి చేస్తున్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వీఎం మణికందకు 2026 సంవత్సరానికి డాక్టర్ హెచ్‌పీ తివారీ పురస్కారం లభించింది. వీఎస్ రావు ఫౌండేషన్ తరఫున బిట్స్ పిలానీ గౌరవ సలహాదారు ఆచార్య వీఎస్ రావు ఈ పురస్కారాన్ని డాక్టర్ వీఎం మణికందకు ప్రదానం చేశారు.

**ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన ప్రొఫెసర్లకు సత్కారం**

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్విరామంగా ఐదేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న మరో 10 మంది ప్రొఫెసర్లను ఈ సందర్భంగా వేదికపై సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అదేవిధంగా విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా బోధనలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మరో 10 మంది ప్రొఫెసర్లను విద్యార్థులే లిలి'పాపులర్ బెస్ట్ టీచర్స్'లిలిగా ఎంపిక చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, హెచ్‌ఆర్ డైరెక్టర్ సామల ఐజక్, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

- పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క!



**మంగపేట, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** పాఠశాల స్థాయి నుంచే విద్యార్థినులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, ఉన్నత లక్ష్యాలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన 14 ల్యాప్‌టాప్‌లతో కూడిన కంప్యూటర్ ప్రయోగశాలను మంత్రి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. ఉన్నత చదువులకు వెళ్లినప్పుడు కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరికరాలను వినియోగించడంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఇప్పటి నుంచే వాటి వినియోగంపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థినులు కంప్యూటర్ విద్యను అభ్యసించేందుకు 14 ల్యాప్‌టాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదివిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కన్నాయిగూడెం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి వరకు చదివి, అనంతరం జవహర్‌నగర్‌లో ఇంటర్ విద్యను అభ్యసించిన విద్యార్థిని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే పట్టుదలతో చదవాలని, పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు, విద్యాలయానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యాలయంలో భోజన నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, నీటి సరఫరా, ఇతర సౌకర్యాల గురించి మంత్రి విద్యార్థినులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే సంకోచించకుండా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థినులు తమ భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, పగలు లేదా రాత్రి వేళల్లో ఉపాధ్యాయులకు తెలియజేయకుండా ఒంటరిగా బయటకు వెళ్లవద్దని సూచించారు.

చదువుతోపాటు శారీరక ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. సమష్టిగా శ్రమదాన కార్యక్రమాల్లో పాల్గొని విద్యాలయ ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అందుబాటులో ఉన్న స్థలంలో కూరగాయల పెంపకంపై అవగాహన పెంచుకోవడంతోపాటు జామ, మామిడి వంటి పండ్ల మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. భవిష్యత్తులో తాము చదివిన విద్యాలయానికి తిరిగి వచ్చినప్పుడు, తాము నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదగడం చూసి ఆనందించేలా వాటిని సంరక్షించాలన్నారు. విద్యార్థినులందరూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, జీసీడీఓ బుర్ర రజిత, మండల విద్యాశాఖ అధికారి మేనక, పాఠశాల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణ బాబు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక ప్రజాప్రతి నిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు



**నర్సంపేట, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంపై నిరసన 6 గ్యారెంటీల అమలు ఎక్కడ అంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద ప్లకార్డులతో నిరసన తెలియజేసిన నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రజా సంక్షేమంలో కాంగ్రెస్ పార్టీ అట్టడుగు స్థాయికి చేరింది అని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. బుధవారం నర్సంపేట పట్టణంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగల రాకేష్ రెడ్డి హాజరైనారు.

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి మాట్లాడుతూ,అటకెక్కిన ఆరు గ్యారెంటీలు. ఎగవేసిన హామీలు అతీగతీ లేనిడిక్లరేషన్లు..మాట మార్చిన మేనిఫెస్టో!

అధికారం కోసం అలవికాని హామీలిచ్చిన కాంగ్రెస్ ఏరు దాటాకతెప్ప తగలేసింది. 420 హామీలు నెరవేర్చకపోగా పలు సంక్షేమ పథకాలను నీరుగార్చింది అని అన్నారు.ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల పేరుతో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, 1000 రోజులు దాటినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైంది కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రజలు విశ్వసించి అధికారాన్ని అప్పగించా రన్నారు. అధికారం లోకి వచ్చిన తర్వాత అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, వృద్ధులు, వితంతువులకు రూ. 4,000 పెన్షన్, రైతులు, కౌలు రైతులకు ఇచ్చిన హామీలు, విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు, ఇందిరమ్మ ఇళ్ల హామీ వంటి అంశాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పాలన లో రైతు బంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, ఆసరా పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, మిషన్ భగీరథ వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని అన్నారు.

రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ,

అసమర్థ కాంగ్రెస్ 1000 రోజుల పాలనను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట లో సమరభేరి నిర్వహించడం జరిగింది. దగాకోరు కాంగ్రెస్ విధానాలను 1000 రోజుల విధ్వంసాన్ని నర్సంపేట గులాబీ సైనికులు నియోజకవర్గ నలుమూలల నుండి విచ్చేసి కథం తొక్కినారు. 100 తప్పులతో శిశుపాలుని తల తెగిపడినట్టు, ఈ రోజు 1000 రోజుల కాంగ్రెస్ విధ్వంస పాలనతో 420 అబద్ధాల కాంగ్రెస్ సర్కార్ కూలిపోవడం ఖాయం అని స్పష్టం చేశారు. మూడేళ్ల పాలనలోనే ముప్పై ఏళ్ళు తెలంగాణను వెనక్కి నెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ పాలన వైఫల్యాలను అడుగడుగునా ఎండగట్టడానికి ప్రతీ గులాబీ సైనికుడు కదిలి రావాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ మాజీ స్టేట్ డైరెక్టర్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ జిల్లా నాయకులు నియోజకవర్గ కోఆర్డినేటర్ పట్టణ పార్టీ అధ్యక్షుడు మండల పార్టీ అధ్యక్షులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాక్స్ చైర్మన్ లూ మాజీ ఎంపీపీలు మాజీ జెడ్పిటీసిలు క్లస్టర్ బాధ్యులు నియోజకవర్గ నాయకులు మండల పార్టీ ముఖ్య నాయకులు, అన్ని మండలాల పట్టణ ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్లు మాజీ కౌన్సిలర్లు మహిళా నాయకులు యూత్ నాయకులు అన్ని అనుబంధ సంఘాల నాయకులు సర్పంచులు మాజీ సర్పంచ్లు మాజీ ఎంపీటీసీలు గ్రామ పార్టీ అధ్యక్షులు వార్డు అధ్యక్షులు పట్టణ పార్టీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

# 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్యాలపై గద్వాలలో బీఆర్ఎస్ భారీ నిరసన

- కాంగ్రెస్ హామీలపై ప్రజలకు బాకీ కార్డుల పంపిణీ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి
- 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో నిరసన ర్యాలీ మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్
- ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలి మాజీ మున్సిపల్ చైర్మన్





**గద్వాల, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గద్వాల జిల్లా కేంద్రంలో బుధవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వారం రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా కృష్ణారెడ్డి బంగ్లా నుంచి ప్రజలకు కాంగ్రెస్ ఎన్నికల హామీలకు సంబంధించిన బాకీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ర్యాలీగా కృష్ణవేణి చౌక్‌కు చేరుకుని పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు, మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ డా.అంజనేయ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన సామాన్య ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని వారు పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి పాలకులు తమ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టోలో పేర్కొన్న 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, మాజీ జడ్పీటీసీలు బాసు శ్యామల, పద్మ వెంకటేశ్వర రెడ్డి, సాకి దేవిడ్, సత్యాన్న, తిమ్మప్ప, కౌన్సిలర్లు పులిపాటి వెంకటేష్, కుమ్మరి సునీత రాము, లత రామకృష్ణ, చిత్తరి మంజుల రాణి కిరణ్, చంటన్న, టీఎన్ఆర్ జగదీష్, గువ్వల గోపాల్, దుబన్న, మోహన్ యాదవ్, నరసింహులు, పటేల్ జనార్దన్ రెడ్డి, కోటేష్, రాఘవేంద్ర రెడ్డి, అంగడి బసవరాజ్, సూర్య గౌడ్ తదితర పార్టీ సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజలకు విసొక్కొచ్చింది

### - మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



**మహబూబ్‌నగర్ సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి ఉద్యోగులు కూడా ఆందోళన పట్టారు గద్దెను ఎక్కిన వెంటనే ఇచ్చిన హామీలు మరిచిన్రు కాంగ్రెస్ పరిపాలనలో వేల కోట్లు ప్రజలకు బాకీ పడ్డారు చిన్నారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, కొండా, కొంత మంది ఎమ్మెల్యేలు మాట్లాడిన మాటలు కూడా ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. వెయ్యి రోజుల ప్రభుత్వ ప్రకటనలో వాళ్ళు చెప్పిన విషయాలు చెప్పి ఉంటె బాగుండు .

ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఢిల్లీలో ముఖ్యమంత్రి..మంత్రులు చక్కర్లు కొడుతున్నారు రైతులు, వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, ఏ వర్గాన్నీ పట్టించుకోకుండా పరిపాలన కొనసాగిస్తున్నారు.

22 ఏ లో ప్రైవేట్ భూములను కూడా పెట్టారు.దాని నుంచి బయటికి తీసుకువచ్చేందుకు డబ్బులు అడిగేందుకు ప్రభుత్వం ఇలా చేసింది.. ప్రజలకు క్షమాపణ చెప్పి 22ఏ రద్దు చేయాలి.

పొంగులేటి అరాచకాలు బాగా పెరిగాయి పేదల ప్రజలను వేధించిన మిమ్మల్ని మేము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజా క్షేత్రం లో ఉంచుతాం

ఫీజు రియంబర్స్ మెంట్ ఇవ్వాలి.. విద్యార్థులు సర్టిఫికెట్ అడిగితే ఫీజు కట్టి తీసుకుపొమ్మని యాజమాన్యాలు చెబుతున్నాయి. 2 లక్షల ఉద్యోగ నియమమకాలు వెంటనే చేపట్టాలి.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి. పెంచుతామన్న పెన్షన్ ఇవ్వాలి.గీత కార్మికులు, నేతన్నలకు, యాదవులు, రజకులు వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రాజెక్ట్ లను ఎండ బెట్టి ఆంధ్రకు తరలిస్తున్నారు. నికర జలాలు తీసుకెళ్తుంటే నోరు మెదపడం లేదు కృష్ణ బేసిన్‌లో ఉన్న వారికీ సాగు నీరు లేదు. పెన్నాలో ఉన్న వారికీ కృష్ణ నీరు ఇస్తున్నారు మా ప్రభుత్వం వచ్చిన వెంటనే రెసర్వాయర్లు నింపుతాము..

రైతులకు సాగు నీరు ఇస్తాము అని తెలిపారు.

## పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా బాధ్యతాయుతంగా పనిచేయాలి
- జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అభినందనలు



**గద్వాల, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లా పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బి.రఘుపతి నాయుడు, ఉపాధ్యక్షులుగా వి.ప్రదీప్ కుమార్, బి.చంద్రకాంత్, కార్యదర్శిగా టి.శేఖర్, జాయింట్ సెక్రటరీగా ఎ.వై.ప్రసాద్, ట్రెజరర్‌గా శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.భీమేష్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా వై.జమ్మన్న, హనుమంతు, కె.దివ్యవాణి, జి.నాగమణి, బి.గణేంద్ర, డి.అంజనేయులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ అసోసియేషన్ సిబ్బంది సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి వేదికగా పనిచేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది మధ్య పరస్పర సమన్వయాన్ని పెంపొందిస్తూ ప్రతి ఒక్కరి సమస్యను సానుకూల దృక్పథంతో పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం అసోసియేషన్ చొరవ చూపాలని తెలిపారు. అదే సమయంలో పోలీస్ శాఖ క్రమశిక్షణ, ప్రతిష్టకు భంగం కలగకుండా నూతన కార్యవర్గం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారం, ఐక్యతను ప్రధాన లక్ష్యాలుగా చేసుకుని నూతన కార్యవర్గం పనిచేస్తుందని ఆశిస్తున్నట్లు ఎస్పీ, అదనపు ఎస్పీ తెలిపారు. నూతన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ సిబ్బంది, అధికారుల మధ్య సమన్వయ వారధిగా నిలిచి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

## రూ.82.25 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



**నల్గొండ, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 101 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన రూ. 82,25,800/- (ఎనభై రెండు లక్షల ఇరవై ఐదు వేల ఎనిమిది వందల రూపాయలు) విలువైన చెక్కులను నేడు నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

### - డీసీసీ వైస్ ప్రెసిడెంట్ రామేశ్వరమ్మ



**గద్వాల, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా గద్వాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి డీసీసీ వైస్ ప్రెసిడెంట్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామేశ్వరమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామేశ్వరమ్మ మాట్లాడుతూ పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాలతో ప్రజల జీవితాల్లో వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ద్వారా ఉమ్మడి రాష్ట్రంలో తాగు, సాగునీటి కొరతను తీర్చిన ఘనత వైఎస్సార్‌కు దక్కుతుందని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గోవిందు, సత్యం, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తుమ్మల నరసింహులు, మురళి, ఇసాక్, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాల శ్రీను, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సీనియర్ నాయకులు జమ్మిచేడు సతీష్, కురుమన్న, నాగేంద్ర యాదవ్, ధర్మనాయుడు, సుదర్శన్, ఇలియాస్, కౌసర్, రిజ్వాన్, కిఫాయత్, శ్రీనివాస్ యాదవ్, కోఆప్షన్ మెంబర్ షరీఫ్, రమేష్ రెడ్డి, వీరేష్, మహేందర్, మోయిన్, రామచంద్రి, మేదరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్‌కు కీలక ముందడుగు

### - దేవరకద్రలో రక్షణ రంగ పరిశ్రమకు మార్గం సుగమం!



**దేవరకద్ర, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** దేవరకద్ర నియోజకవర్గంలో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి నిరంతర కృషి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ ప్రాజెక్టు సాకారం దిశగా మరింత ముందుకు సాగుతోంది. దేవరకద్ర మండలంలో DRDL ఆధ్వర్యంలో ప్రతిపాదించిన బ్రహ్మోస్ యూనిట్ కోసం 416.18 ఎకరాల భూసేకరణ పూర్తయింది. ఈ భూమిని ప్రాజెక్టుకు కేటాయించేందుకు TGIIC అంగీకరించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో జరిగిన సమావేశంలో వివరించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించడంతో దేవరకద్రలో బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు కీలక మద్దతు లభించినట్లైంది. ఈ ప్రాజెక్టు కేవలం దేవరకద్ర అభివృద్ధికే కాదు, మహబూబ్‌నగర్ జిల్లాను రక్షణ రంగ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఒక చారిత్రాత్మక అడుగు. బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుతో పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు, స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా భారీగా ఉద్యోగ అవకాశాలు అందే అవకాశం ఉంది. దేవరకద్రకు భారీ పరిశ్రమలు... యువతకు ఉద్యోగాలు... ప్రాంతానికి పారిశ్రామిక ప్రగతి. శాసన సభ్యులు జీఎమ్ఆర్ కృషితో దేవరకద్ర అభివృద్ధిలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోంది అని కాంగ్రెస్ శ్రేణులు అంటున్నారు.

## పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసిన గొంగొల్ల ఈశ్వర్



**హైదరాబాద్, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌ను బుధవారం జోగులాంబ గద్వాల జిల్లా సింగవరం-1 గ్రామసర్పంచ్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గొంగొల్ల ఈశ్వర్ కలిశారు. తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ భవనంలో రాష్ట్రంలోని ఆదర్శ సర్పంచులతో నిర్వహించిన వీబీజీ రామ్‌జీ పథకంపై సమావేశంలో ఆయన గ్రామీణ ప్రాంతాల సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీబీజీ రామ్‌జీ పథకం అమలులో పలు సాంకేతిక లోపాలతో పాటు సిబ్బంది కొరత, పనులు అమలు చేసే సిబ్బంది లేకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని గొంగొల్ల ఈశ్వర్ తెలిపారు. దీంతో తెలంగాణలో సగటు ఉపాధి హామీ పనిదినాలు దేశ సగటుతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని, గ్రామాల్లో పేదలకు మరింత ఎక్కువగా ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మిషన్ భగీరథ నీరు సరఫరా కాని రోజుల్లో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రతి గ్రామంలో మినరల్ ఆర్వో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్పంచుల గౌరవ వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు గౌరవ వేతనం పెంచాలని కోరారు. అదేవిధంగా గ్రామాల్లో ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు విధులు నిర్వహించేందుకు అవసరమైన భవనాలను సంబంధిత పథకం కింద నిర్మించాలని పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్‌ను కోరారు. ఈ సమస్యలపై స్పందించిన కమిషనర్ దివ్య దేవరాజన్ తెలంగాణను దేశంలోనే అత్యధిక పనిదినాలు కల్పించే రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచ్ గొంగొల్ల ఈశ్వర్ ప్రస్తావించిన ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## నగరంలోని ప్రతి డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం

### - ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

### - రూ.15.17కోట్లతో యూజీడీ పనులకు శంకుస్థాపన



**మహబూబ్‌నగర్ సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :** మహబూబ్‌నగ నగరంలోని ప్రతి డివిజన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం విడతల వారిగా చేపట్టనున్నట్లు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణపు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా, నగరంలోని 20వ డివిజన్ పద్మావతి కాలనీలో రూ.15.17 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారం ఉండాలని ప్రజలు కూడా సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, అజ్మత్ అలి, 20వ డివిజన్ కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి తో పాటు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాన వాటా కల్పించాలి

### బీసీలకు 50%, ఎస్సీలకు 20%, ఎస్టీలకు 10% రిజర్వేషన్లు కల్పించాలి: యాటకారి సాయన్న



**సోన్, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
దేశ జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాన వాటా కల్పించడమే లక్ష్యంగా ఉద్యమించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాటకారి సాయన్న మాట్లాడుతూ బీసీలకు 50 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీలకు రక్షణ చట్టాలు తీసుకురావడంతో పాటు, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లోని యువత రాజకీయంగా చైతన్యవంతం కాకపోతే దేశం మరింత వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. అత్యధిక జనాభా కలిగిన కులాలు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించడంతో పాటు, అత్యున్నత రాజకీయ పదవులను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు రామగిరి రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ముద్రబోయిన దినేష్, జిల్లా కార్యదర్శి కల్లూరు సుధాకర్, భీమేష్, బోడ గంగాధర్ యాదవ్, చింతల ప్రవీణ్ , బర్మా శ్రీకాంత్,అంకం సురేష్, న్యారాడి రాము ,మేకల శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంస్కృత భాషా దినోత్సవం

### -భెల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేడుకలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
భెల్ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవీందర్ మాట్లాడుతూ సంస్కృతం ప్రపంచంలోనే అతి ప్రాచీన భాష అని, భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, శాస్త్రీయ సాహిత్యానికి ఇది మూలస్తంభమని పేర్కొన్నారు. దేవనాగరి లిపిలో రాసే ఈ భాషను దేవుళ్లు మాట్లాడే దేవభాషగా పిలిచేవారని, వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, రామాయణం, మహాభారతం, కాళిదాసు కావ్యాలు సంస్కృతంలోనే ఉన్నాయని వివరించారు. సంస్కృత పదాల ఉచ్చారణ వల్ల నాడీ వ్యవస్థ, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగుపడతాయని, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ, బెంగాలీ తదితర భారతీయ భాషల పదజాలంపై దీని ప్రభావం మెండుగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు ద్వితీయ భాషగా సంస్కృతాన్ని ఎంచుకుని అధిక మార్కులు సాధించవచ్చని సూచించారు. అనంతరం వేడుకల్లో భాగంగా విద్యార్థులు మాట్లాడారు, పాటలు పాడారు. ఈ సందర్భంగా గీతా మాధురి పాడిన పాట అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో సంస్కృత లెక్చరర్ సతీష్, ఇతర అధ్యాపకులు నర్సింలు, శ్రీనివాసరావు, మధుసూదన్, రమ్య, నిర్మలదేవి, ముత్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మల్లంపల్లి నుంచి ములుగు జిల్లా కేంద్రానికి బీఆర్ఎస్ భారీ బైక్ ర్యాలీ



**మల్లంపల్లి, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు,ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మల్లంపల్లి నుంచి ములుగు జిల్లా కేంద్రానికి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.మల్లంపల్లి మండలంతో పాటు పరిసర గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బైక్‌లపై తరలివచ్చారు.పార్టీ జెండాలు చేతబూని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జిల్లా కేంద్రానికి ర్యాలీగా వెళ్లారు.రైతు భరోసా, రుణమాఫీ,నిరుద్యోగులకు ఉద్యోగాలు,మహిళలకు ఇచ్చిన హామీలు సహా ఎన్నికల హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.హామీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, పరిసర గ్రామాల పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 5వ తేదీన ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం




**నంద్యాల, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఏపీ ఎన్ జి జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ విద్యాసాగర్ మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి రమణ ఆదేశం మేరకు బుధవారం ఏపీఎన్జీజీవోస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు బిసి హుస్సేన్ రెడ్డి అధ్యక్షతన స్థానిక ఎన్జీవో హోం నందు జరిగింది. ఈ సమావేశమునకు ముఖ్య అతిథిగా రాష్ట్ర సహాధ్యక్షులు కామ్రేడ్ వి . దస్తగిరి రెడ్డి హాజరయ్యారు .ఈ సమావేశము నందు ఉద్యోగులకు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న PRC కమీషన్ ఏర్పాటుతో పాటు IR ,పెండింగ్లో ఉన్నటువంటి DA తదితర విషయాల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి పట్ల రాబోయే రోజులలో ఏపీ జేఏసీ ఏపీ ఎన్జీవోస్ రాష్ట్ర సంఘం పక్షాన తీసుకోబోయే నిర్ణయాలకు అనుగుణంగా తాలూకా మరియు జిల్లా స్థాయిలలో తీసుకోవలసిన చర్యల గురించి విస్తృతంగా చర్చించడం జరిగినది. ఈనెల 5వ తేదీన జరగనున్న ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పిమ్మట తీసుకోబోయే నిర్ణయంపైన పూర్తి స్థాయిలో కార్యాచరణను అమలు చేయటానికి సంసిద్ధంగా ఉండాల్సిందిగా అన్ని తాలూకాల జేఏసీ మరియు ఏపీ అసోసియేషన్ కార్యవర్గాలను సమాయత్తం చేయవలసిందిగా ఈ సమావేశంలో నిర్ణయించినారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ నంద్యాల జిల్లా కార్యదర్శి నరసారెడ్డి , జిల్లా సహాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి,అన్ని తాలూకాల శ్రీశైలం, ఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాల, డోన్,ఆళ్లగడ్డ,కోవెలకుంట్ల, బనగానపల్లె తాలూకాల అధ్యక్ష కార్యదర్శులు మరియు జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్





**ఆదిలాబాద్, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్శాపూర్ వార్డు నంబర్ 49 లో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్‌లోని విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. వంటశాలను పరిశీలించి అన్నం, పప్పు, చికెన్, వెజిటబుల్ కర్రీ, పెరుగు తదితర ఆహార పదార్థాలను రుచి చూశారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లో నిర్వహిస్తున్న టీజ్ ఉత్సవాల్లో పాల్గొని, విద్యార్థినులతో కలిసి నృత్యం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ట్రైబల్ వెల్ఫేర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశాల మేరకు ప్రతి వారం ఒకటి రెండు హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శించి భోజన నాణ్యతను పరిశీలిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలవు తున్నాయా లేదా అని పరిశీలిస్తున్నామన్నారు. విద్యార్థినుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, హాస్టళ్లలో సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి - బీజేపీ ఎస్సీ మోర్చా ఆరోపణ



**తాండూర్, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణ దేవరాయలు ఆరోపించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తాండూర్ మండలం మాదారం లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద రేవంత్ రెడ్డి ఫోటోతో కూడిన ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై, సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటంపై కాంగ్రెస్ కార్యకర్తలు నలుపు రంగు చల్లి అవమానించడం కాంగ్రెస్ విధానానికి నిదర్శనమని, ఇది ఎస్సీ సమాజ మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. రాజకీయ భేదాలు ఉండవచ్చు కానీ మహనీయుల చిత్రాలను అవమానించడం సమర్థనీయం కాదని, ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను కాగితాలకే పరిమితం చేయకుండా కాలపరిమితితో అమలు చేయాలని, ఏ హామీ అమలైంది, ఎంత నిధులు కేటాయించారనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. అలాగే ఎస్సీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంత్ రవిదాస్ మహారాజ్ చిత్రపటాన్ని అవమానించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, కార్యదర్శి గాదె రాజేశం, నాయకులు అవుల చందు, ఆనంద్, త్రినాథ్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## మూలపోచారం ఆశ్రమ పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్ సక్సెస్!




**సింగరేణి (ఏన్కూర్), సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
మండల పరిధిలోని మూలపోచారం ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సమావేశం అత్యంత ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రగతి,హాజరు శాతం, క్రమశిక్షణ,వ్యక్తిగత అభివృద్ధి, పాఠశాల-ఇంటి సమన్వయం తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సుదీర్ఘంగా చర్చించారు.
పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు, వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చేపడుతున్న పలు కార్యక్రమాలను ఉపాధ్యాయులు వివరించారు.పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిత్యం వారి అభ్యసనాన్ని పరిశీలిస్తూ ఉపాధ్యాయులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని కోరారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగరాజు, డిప్యూటీ వార్డెన్ డిఎస్.నాగేశ్వరరావులు మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర వికాసానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉమ్మడి కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి,వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల చేతుల మీదుగా దుస్తులు, బ్యాగులు,బెడ్ షీట్లను పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి, పిల్లల భవిష్యత్తుకు పూర్తి సహకారం అందిస్తామని తల్లిదండ్రులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. శోభన్,బి.రవి,బి. సక్రాం,బి.సింగ్య,జే. నాగేశ్వరరావు,ఎం. చంద్రరావు,పాయం శ్రీనివాస్,డి. వెంకటరమణ,బి. శారదా భాయి, హర్యానాయక్,ఉషశ్రీ, తల్లిదండ్రులు మల్లేశ్వర రావు,గోపి, నాగమల్లేశ్వరి, మోహన్ రావు, ప్రసాద్,బసవయ్య, ఎస్.రమేష్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## జేడి మల్లంపల్లిలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

- ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షల వెల్లువ
- భారీ కేక్ కట్ చేసి పటాకులు కాల్చి సంబరాలు జరిపిన అభిమానులు
- మల్లంపల్లి మండల కేంద్రంలో హోరెత్తిన 'పవర్ స్టార్' నినాదాలు



**ములుగు, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలో పవన్ కళ్యాణ్ అభిమానులు అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మల్లంపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన అభిమానులంతా ఒకచోటికి చేరి పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ భారీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానుల జైకారాల మధ్య భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.పటాకులు కాల్చి, నినాదాలతో మల్లంపల్లి వీధులను హోరెత్తించారు.సినీ రంగంలో పవర్ స్టార్‌గా కోట్లాది మంది గుండెల్లో స్థానం సంపాదించుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి నిస్వార్థ సేవలతో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన పవన్ కళ్యాణ్ ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభిమానులు కొనియాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరితపించే పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమానులు మహమ్మద్ ఖలీల్, మురహరి విజయకాంత్, అశోక్, సంతోష్, కోయిల నవీన్‌లతో పాటు పలువురు స్థానిక అభిమానులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## న్యూ వెల్మల్ లో ( VB-G RAM G )మొదటి గ్రామసభ



**న్యూవెల్మల్ (జర్నలిస్ట్ ఫైల్) :** న్యూ వెల్మల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన VB-G RAM G (వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ – (గ్రామీణ్) పథకం కింద మొదటి గ్రామసభ ఘనంగా నిర్వహించారు.
ఈరోజు ఉదయం 10:46 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి గ్రామ పంచాయతీ అధికారులు, ఫీల్డ్ స్టాఫ్, మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా అధికారులు VB-G RAM G పథకం లక్ష్యాలు, కొత్త మార్గదర్శకాల గురించి గ్రామస్తులకు వివరించారు.

**సమావేశంలో చర్చించిన ప్రధాన అంశాలు**

ఉపాధి హామీ జాబ్ కార్డుల వెరిఫికేషన్ పాత MGNREGA జాబ్ కార్డులను కొత్త VB-G RAM G వ్యవస్థలోకి మార్చడం, కొత్త జాబ్ కార్డుల జారీ 2. పనుల గుర్తింపు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు – నీటి సంరక్షణ, రోడ్ల నిర్మాణం, ప్లాంటేషన్ వంటి వాటి ప్రతిపాదన. 3. గ్రామీణ జీవనోపాధి: కేవలం 100 రోజుల పని మాత్రమే కాకుండా, నైపుణ్యాభివృద్ధి ద్వారా శాశ్వత ఆదాయ వనరులు కల్పించడమే ఈ కొత్త పథకం లక్ష్యమని వివరణ. 4. సామాజిక తనిఖీ: పనుల్లో పారదర్శకత కోసం సోషల్ ఆడిట్ ఆవశ్యకత.
ఈ గ్రామసభతో న్యూ వెల్మల్ లో అభివృద్ధికి కొత్త అధ్యాయం మొదలైందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా మరింత మెరుగైన ఉపాధి లభిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో కే రామకృష్ణ, సర్పంచ్ రాచకొండ సాగర్, పంచాయతీ సెక్రెటరీ భూపాల్ రెడ్డి,ఏపిడి నాగవర్ధన్, ఏపీవో రామకృష్ణ, టి ఏ కృష్ణవేణి వార్డు మెంబర్, ఆశా వర్కర్స్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

## 420 హామీలు ఎప్పుడు అమలు చేస్తారు?

### - ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్



**పటాన్‌చెరు, సెప్టెంబరు 03 (జర్నలిస్ట్ ఫైల్) :**
పటాన్చెరువు నియోజకవర్గం లోఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వ తీరును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేసింది.
కేసీఆర్ ఆదేశాల మేరకు, మాజీ మంత్రి హరీష్ రావు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం పటాన్‌చెరువులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఫ్లెక్సీ ర్యాలీ, బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి సుమారు 1000 రోజులు గడుస్తున్నా మేనిఫెస్టోలో ప్రకటించిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడం కాదు.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.
ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు.

## ప్రజల సంతృప్తి మేరకు సేవలు అందాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల సంతృప్తి మేరకు సేవలు అందాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై ప్రజల సంతృప్తి పెరగాలని అన్నారు. పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ పై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు కావాలన్నారు. జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షణ సక్రమంగా చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం అనే కార్యక్రమాలను చేపడుతుందని తద్వారా ప్రజలు లబ్ధి పొందాలని అన్నారు. ప్రజలకు పథకాలు అమలైనప్పటికీ వాటిపై సంతృప్తి శత శాతం ఉండాలని చెప్పారు. సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించడం, మంచి ప్రవర్తనతో మాట్లాడటం వలన సంతృప్తి స్థాయి బాగుంటుందన్నారు. వీటిని పక్కాగా అమలు చేయాలని చెప్పారు. అర్జీలు సమర్పించిన వ్యక్తులతో నేరుగా మాట్లాడి తగిన సమాచారాన్ని అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 27 మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి



- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపిన సిబ్బంది
- 21 రోజుల ప్రమోషనల్ ట్రైనింగ్.. బీఎన్ఎస్‌పై ప్రత్యేక శిక్షణ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా పోలీస్ శాఖలో 1996, 1998, 2000, 2009 బ్యాచ్‌లకు చెందిన 27 మంది సివిల్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ సెప్టెంబరు 2న ఉత్తర్వులు జారీ చేశారు.
పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు గురువారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించి, పదోన్నతితో లభించిన అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. పదోన్నతి పొందిన వారిలో మహమ్మద్ ఇస్మాయిల్, పటాన్ బాలసయ్యద్ ఖాన్, ఆలపాటి లక్ష్మీ ప్రసాద్, నామా జోసెఫ్, మొగల్ కాజా మొహిద్దీన్ బేగ్, కొల్లి శ్రీనివాసరావు, చిట్టిపోతుల వెంకటేశ్వర్లు, చందనం పరమేశ్వరరావు, ఏమిని రామకృష్ణ, మర్రి అంకమ్మరావు, నందూరి రవిబాబు, ముజావర్ హుస్సేన్, షేక్ కరీమ్ భాషా, షేక్ సంసుద్దీన్, కర్రోతు భిక్షా నాయక్, గుంజ శ్రీనివాసరావు, వాసిమల్ల అశోక్‌కుమార్, పోతూరి ఫణిరాజ్, కారేటి గోపికృష్ణ, నత్తల సూర్యప్రకాశ్‌రావు, చిమట వెంకటేశ్వరరావు, సయ్యద్ అబ్దుల్ వహాబ్, మండల వెంకటేశ్వర్లు, మిట్ట మల్లికార్జునరావు, షేక్ రఫీ, ఇందుర్తి నాగరాజు, చింకా కిషోర్ ఉన్నారు.
అనంతరం పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు అడిషనల్ ఎస్పీ రమణమూర్తిని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వారికి అభినందనలు తెలిపారు. అక్టోబరు 1 నుంచి 21 రోజులపాటు ప్రమోషనల్ ట్రైనింగ్‌తో పాటు ఇండోర్, అవుట్‌డోర్ శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణలో బీఎన్ఎస్ చట్టంలోని ముఖ్యమైన అంశాలతో పాటు విధి నిర్వహణలో అవసరమైన మెలకువలపై సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి రైటర్స్‌గా, సమర్థవంతమైన అసిస్టెంట్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. పదోన్నతి పొందిన సిబ్బంది విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన వైఖరితో పనిచేస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఉన్నతాధికారులు ఆకాంక్షించారు.

## లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్లో ఘనంగా ముందస్తు గోకులాష్టమి వేడుకలు



**కడప,(జర్నలిస్ట్ ఫైల్):** కడప ఎన్జీవో కాలనీలోని హైదరాబాద్‌కు చెందిన ద మాస్టర్ మైండ్ స్కూల్స్ లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్‌లో ముందస్తు గోకులాష్టమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దఈ సందర్భంగా చిన్నారులు బాలకృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. బాలకృష్ణుడి వేషధారణలో చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కృష్ణుడి బాల్య ఘట్టాలు, కృష్ణలీలలను ప్రతిబింబించేలా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. చిన్నారులకు భారతీయ సంప్రదాయాలు, పండుగల విశిష్టతను పరిచయం చేయడంలో భాగంగా గోకులాష్టమి వేడుకలను నిర్వహించడం ఆనందంగా ఉందని స్కూల్ సెంటర్ హెడ్ రాయ స్వర్ణలత తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో సంప్రదాయాలు, సంస్కృతిపై ఆసక్తిని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మదర్ టీచర్లు మనోహరి, ఆశాజ్యోతి, స్వరూపరాణి, శృతి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమలో అభివృద్ధి జోరు

- రూ.13 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- ప్రతి డివిజన్‌కు మౌలిక వసతులు.. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగం జరుగుతున్నాయి. గురువారం నియోజకవర్గ పరిధిలోని 18, 19, 20, 22, 25వ డివిజన్లలో సుమారు రూ.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, తాగునీటి సౌకర్యాలు, సచివాలయ భవన నిర్మాణం వంటి ప్రజలకు నిత్యావసరమైన మౌలిక వసతుల కల్పనకు ఈ పనులు దోహదపడనున్నాయి.
18వ డివిజన్‌లో రూ.1.13 కోట్ల వ్యయంతో పల్నాడు బస్టాండ్ నుంచి పట్నం బజార్ మెయిన్ రోడ్ వరకు సీసీ డ్రెయిన్ నిర్మాణం, శ్రీనివాసరావుతోటలో కొత్త సచివాలయ భవనం నిర్మాణం, కంపౌండ్ వాల్, పాత భవనాల మరమ్మతులు, వడ్డెగూడెం ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, పైప్‌లైన్ పనులకు శ్రీకారం చుట్టారు.
19వ డివిజన్‌లో రూ.2.51 కోట్లతో నల్లచెరువు ప్రాంతంలోని పలు లైన్లలో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.
20వ డివిజన్‌లో రూ.3.93 కోట్లతో సంపత్‌నగర్, నల్లచెరువు, కొబ్బరితోట ప్రాంతాల్లో సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ కల్వర్టులు, వెట్‌మిక్స్ రోడ్లు, అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.
22వ డివిజన్‌లో రూ.2.55 కోట్లతో నైజాం బజార్, ఏటీఎం బజార్, 60 అడుగుల రోడ్డులో సీసీ డ్రెయిన్లు, ఆర్‌సీసీ కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.
25వ డివిజన్‌లో రూ.2.83 కోట్లతో నరసరావుపేట రోడ్డులో డ్రెయిన్ నిర్మాణం, గెలాక్సీ బార్ రోడ్డులో డ్రెయినేజ్ పనులు, విశాలాక్షి కోల్డ్ స్టోరేజ్ వరకు సీసీ రోడ్డు, మురికిపేట ప్రాంతాల్లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.
ఇప్పటికే నియోజకవర్గంలో రూ.350 నుంచి రూ.400 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైప్‌లైన్లు, స్ట్రీట్‌లైట్లు, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనలో గణనీయమైన మార్పు తీసుకువచ్చామన్నారు. గతంలో సమస్యలతో ఇబ్బంది పడిన ప్రాంతాల్లో ఇప్పుడు మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని తెలిపారు.
పల్నాడు బస్టాండ్ నుంచి పట్నంబజార్ వరకు, నల్లచెరువు, సంపత్‌నగర్, కొబ్బరితోట, శ్రీనివాసరావుతోట, మురికిపేట తదితర ప్రాంతాల్లో ఎన్నాళ్లుగానో ప్రజలు ఎదురుచూస్తున్న పనులు ఇప్పుడు కార్యరూపం దాలుస్తున్నాయని చెప్పారు. కొబ్బరితోట ప్రాంత ప్రజలు రోడ్లు, డ్రెయిన్ల కోసం పలుమార్లు వినతులు అందించారని, ఆ సమస్యలకు ఇప్పుడు పరిష్కారం లభించబోతోందన్నారు.
ప్రజలకు అవసరమైన మంచినీటి సరఫరా, డ్రెయినేజ్ వ్యవస్థ, పారిశుద్ధ్యం, స్ట్రీట్‌లైటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉన్నట్లు తమ దృష్టికి వస్తే వెంటనే స్పందించి పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు.
ఈ రోజు శంకుస్థాపన చేసిన పనులన్నింటినీ వచ్చే రెండు నుంచి మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల అమలులో జాప్యం జరిగిన కొన్ని సందర్భాల్లో కాంట్రాక్టర్ల సమస్యలు, పెండింగ్ బిల్లులు వంటి కారణాలు ఉన్నప్పటికీ ఇప్పుడు వాటిని అధిగమించి పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఎన్నికలు వస్తున్నాయనే ఉద్దేశంతో పనులు చేపట్టడం లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కూడా పెండింగ్‌లో ఉన్న అన్ని పనులకు అంచనాలు సిద్ధం చేసి టెండర్లు పిలిచి పూర్తి చేస్తామన్నారు. అక్టోబర్ నెల నుంచి కొత్త వృద్ధాప్య, వితంతు పెన్షన్ల పంపిణీ ప్రారంభం కానుందని, ఇప్పటికే 'తల్లికి వందనం', ఇళ్ల పట్టాల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి వారి ఇంటి వద్దకే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. 2029 ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ఎన్నికల బరిలోకి వెళ్తామని గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమాల్లో ఉల్లి గోపాల్ కృష్ణ, రాళ్ళ బండి రామరాజు, గాలం వెంకటేశ్వర్లు, షేక్ ఇమ్రాన్, చింతకాయల వెంకట సాయి, కూటమి నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## సూర్యలంక నగరవనాన్ని సందర్శించిన ఏపీ గ్రీన్ సొసైటీ ఛైర్మన్ నాగబాబు

- ఘన స్వాగతం పలికిన విన్నకోట సురేష్
- పార్టీ కార్యక్రమాలను ప్రతి ఊరూ, వాడకూ తీసుకెళ్లాలని పిలుపు
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయం: నగరవనం అభివృద్ధి, హరిత వాతావరణంపై ప్రత్యేక సమీక్ష



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** బాపట్ల జిల్లా లో పర్యావరణ పరిరక్షణ రాజకీయ ఉత్సాహం ఒకే వేదికపై ఆవిష్కృతమయ్యాయి. ఏపీ గ్రీన్ సొసైటీ కార్యనిర్వాహక కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు బాపట్ల పర్యటన నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బాపట్ల రూరల్ పరిధిలోని ప్రసిద్ధ సూర్యలంక తీర ప్రాంతానికి సమీపంలో ఉన్న నగరవనాన్ని సందర్శించేందుకు విచ్చేసిన ఆయనకు, అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ ప్రముఖ నాయకులు విన్నకోట సురేష్ ఘనంగా స్వాగతం పలికారు. సూర్యలంక నగరవనానికి విచ్చేసిన కొణిదెల నాగబాబుకు జనసేన నాయకులు విన్నకోట సురేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఆప్యాయంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో ఘనంగా సత్కరించి గౌరవించారు. ఈ సందర్భంగా నగరవనం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, తీర ప్రాంతంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గ్రీన్ సొసైటీ ద్వారా అమలు చేయాల్సిన ప్రణాళికలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పర్యాటకులను ఆకర్షించేలా నగరవనాన్ని తీర్చిదిద్దాలని నాగబాబు అభిలషించారు. ఈ పర్యటన కేవలం అధికారిక కార్యక్రమంగానే కాకుండా, రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది. నగరవనం సందర్శనంతరం ఎమ్మెల్సీ నాగబాబు, జనసేన నాయకులు విన్నకోట సురేష్‌తో కలిసి బాపట్ల నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై ప్రత్యేకంగా మంతనాలు జరిపారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ మూలాలు మరింత గట్టిపడేలా శ్రేణులు అంకితభావంతో శ్రమించాలని పిలుపునిచ్చారు. పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ, సేవా కార్యక్రమాలను ప్రతి ఊరూ, వాడకూ విస్తృతంగా తీసుకువెళ్లి ప్రజలకు చేరువ కావాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై విన్నకోట సురేష్‌తో చర్చించిన నాగబాబు ప్రభుత్వ పరంగా, గ్రీన్ సొసైటీ పరంగా అందవలసిన సహకారాన్ని అందిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని నాయకులకు ఘనంగా అభివాదం తెలిపారు.
పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ, పార్టీ శ్రేణులలో నూతనోత్సాహాన్ని నింపిన ఈ పర్యటన బాపట్ల రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తించింది.

## తాగునీటి సమస్య పరిష్కారానికి కెసి కెనాల్ నుండి నీటి విడుదల



- రైతులు తొందరపడి పంటలు సాగు చేయవద్దు: ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్ ):**
మైదుకూరు నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవ తీసుకున్నారు. గత రెండు రోజులుగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు ప్రజలు తాగునీటి ఇబ్బందులను వివరించడంతో వెంటనే స్పందించారు.
ఈ మేరకు కేసీ కెనాల్ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి కొన్ని రోజులపాటు కెనాల్‌కు నీటిని విడుదల చేస్తే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను అధిగమించవచ్చని వివరించారు. ఎమ్మెల్యే చొరవతో రెండు రోజుల్లో కేసీ కెనాల్‌కు నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే కేసీ కెనాల్ పరిధిలోని రైతులు నీరు వస్తుందనే ఉద్దేశంతో తొందరపడి పంటలు సాగు చేయవద్దని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం విడుదల చేసే నీటిని కుంటలుచెక్ డ్యామ్‌లను నింపుకోవడంతో పాటు తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు.
సాగునీరు వస్తుందని భావించి ముందస్తుగా పంటలు సాగు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉందని సాగునీటి విడుదలపై అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చే వరకు రైతులు పంటలు సాగు చేయవద్దని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.
ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కె సి కెనాల్ నుంచి నీటి విడుదలకు చొరవ తీసుకున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు ప్రజలు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## కొత్త నందాయపాలెంలో ప్రతిష్టాత్మకంగా గ్రామ సభ

- సచివాలయం సిబ్బంది గైర్హాజరుపై ఎంపీటీసీ తాండ్ర సంబశివరావు ఆగ్రహం



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామాల సమగ్ర వికాసానికి గ్రామ సభలు ఎంతగానో దోహదపడతాయని నల్లమోతువారిపాలెం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు అన్నారు. సాధారణ ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణ మరియు అభ్యంతరాల స్వీకరణ నిమిత్తం కొత్త నందాయపాలెం గ్రామంలో ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు.
ఈ సభకు గ్రామ ఓటర్ల జాబితా పర్యవేక్షణ అధికారి, ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు మరియు ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామంలో గుర్తించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించి సంపూర్ణ జాబితాను రూపొందించినట్లు ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్ ఈ జాబితాను గ్రామ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ ఓటు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. సరైన పత్రాలు సమర్పించి ఓటు హక్కును భద్రపరుచుకోవడం ద్వారా కుటుంబాలు, గ్రామాల వికాసంతో పాటు దేశాభివృద్ధికి సహకరించినవారవుతారని పేర్కొన్నారు.
గ్రామంలో వీధి లైట్లు వెలగడం లేదనే సమస్య గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా ఎంపీటీసీ సాంబశివరావు వెంటనే అధికారులతో చర్చించి, గ్రామ సభ అనంతరమే యుద్ధ ప్రాతిపదికన గ్రామం మొత్తం వీధి లైట్లు ఏర్పాటు చేయించారు. ప్రజా సమస్యపై వెంటనే స్పందించిన ఆయనను గ్రామస్తులు అభినందించి సంతోషం వ్యక్తం చేశారు.

**సచివాలయం సిబ్బంది గైర్హా జరుపై తీవ్ర ఆగ్రహం:**

గ్రామ స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ గ్రామ సభకు స్థానిక సచివాలయం సిబ్బంది అందరూ హాజరై ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సి ఉండగా, ఒక్కరు కూడా రాకపోవడాన్ని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తీవ్రంగా పరిగణించారు. ఈ నిరుత్సాహకర ధోరణిని సభలో ఉన్నతాధికారి హోదాలో పాల్గొన్న ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఈ విషయాన్ని వెంటనే జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు.
ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మనోజ్, మాజీ సర్పంచ్ రావి రాంబాబు రెడ్డి, శ్రీనివాసరెడ్డి (హీరో), రావి అంజిరెడ్డి తదితర గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొండపాటూరులో ముగిసిన గ్రామసభ



- ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల జాబితా ఆమోదం

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వం నిర్దేశించిన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గుంటూరు జిల్లా, కాకుమాను మండలం కొండపాటూరు గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. కాకుమాను మండల తహసీల్దార్ (కొండపాటూరు గ్రామ ప్రత్యేక అధికారి) బి వెంకటస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.
ఈ గ్రామసభలో గ్రామపంచాయతీకి సంబంధించిన ఎస్సీ, ఎస్టీ మరియు బీసీ ఓటర్ల జాబితాను గ్రామస్తుల సమక్షంలో చదివి వినిపించారు. ఓటర్ల జాబితాపై గ్రామస్తులకు ఎటువంటి అభ్యంతరాలు లేకపోవడంతో, ఎలాంటి వివాదాలు లేకుండా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.
ఈ కార్యక్రమంలో కాకుమాను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి. వీరస్వామి, కొండపాటూరు పంచాయతీ అభివృద్ధి అధికారి కే రామకృష్ణ రెడ్డి , రెవెన్యూ సిబ్బంది మరియు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలపై కమిషనర్ మయూర్ అశోక్ సీరియస్

- పట్నంబజార్‌లో ఆకస్మిక తనిఖీలు.. నిషేధిత ప్లాస్టిక్ గుర్తింపు, దుకాణాల సీజ్
- విక్రేతలతో పాటు వినియోగదారులపైనా జరిమానాలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగంపై నగర పాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణానికి, ప్రజారోగ్యానికి హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలను అరికట్టడంలో భాగంగా గురువారం పట్నంబజార్‌లోని పలు హోల్‌సేల్ దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.
తనిఖీల్లో భారీగా నిల్వ ఉంచిన నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను గుర్తించారు. సంబంధిత దుకాణాలను వెంటనే సీజ్ చేయడంతో పాటు, నిబంధనల మేరకు అపరాధ రుసుం విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు.
గత 45 రోజులుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం ట్రేడ్ లైసెన్స్ కూడా లేకుండా దుకాణాలు నిర్వహిస్తున్నా పట్టించుకోకపోవడంపై సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు శానిటేషన్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సీఎంఓహెచ్‌ను ఆదేశించారు.
నగరంలోని హోల్‌సేల్ దుకాణాలకు నిషేధిత క్యారీ బ్యాగులు, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులను సరఫరా చేస్తున్న తయారీ సంస్థల వివరాలను సేకరించాలని కమిషనర్ ఆదేశించారు. సంబంధిత పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం ఆయా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు.
నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయించే వారిపైనే కాకుండా వాటిని వినియోగించే ప్రజలు, వ్యాపారులపైనా అపరాధ రుసుం విధించాలని స్పష్టం చేశారు. గుంటూరు నగరాన్ని ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాగితం, గుడ్డ సంచులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.
నగరంలోని పలు వాణిజ్య సంస్థలు ట్రేడ్ లైసెన్స్ లేకుండా, ఆస్తి పన్ను చెల్లించకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించామని కమిషనర్ తెలిపారు. రానున్న వారం రోజుల్లోగా వార్డు సచివాలయాల పరిధిలోని ప్రతి వాణిజ్య సంస్థ తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందడంతో పాటు ఆస్తి పన్ను చెల్లించాలని ఆదేశించారు. ఆకస్మిక తనిఖీల్లో ట్రేడ్ లైసెన్స్ లేకపోయినా, ఆస్తి పన్ను చెల్లించకపోయినా నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్‌బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు అయూబ్ ఖాన్, సోమశేఖర్, వెంకటప్పయ్య, రాజేష్, సాంబయ్య, ఐజాక్, ప్రజారోగ్య అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఉద్యోగ సంఘాలతో సెప్టెంబరు 5 లోగా చర్చలకు అవకాశం



- 12వ పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, బకాయిలపై ప్రభుత్వంతో చర్చలకు ఏపీజేఏసీ ప్రయత్నాలు

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** 12వ పీఆర్సీ, ఐఆర్ ప్రకటన, పెండింగ్ డీఏలు, ఉద్యోగుల ఆర్థిక బకాయిల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఏపీజేఏసీ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. గత వారం రోజులుగా ఉద్యోగుల సమస్యలు, మనోభావాలు, ఆవేదనలను ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి ఏపీజేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్ తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్చలు జరుపుతున్నట్లు ఏపీజేఏసీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రికి ఉద్యోగుల సమస్యలను సమగ్రంగా వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నాయి. సెప్టెంబరు 5లోగా ముఖ్యమంత్రి సమక్షంలో ఉద్యోగ సంఘాలతో చర్చలకు అవకాశం ఉన్నట్లు ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం అందినట్లు ఏపీజేఏసీ వర్గాలు వెల్లడించాయి. ఒకవైపు ప్రభుత్వంతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తూనే, మరోవైపు సెప్టెంబరు 5న ప్రకటించిన ఉద్యమ కార్యాచరణకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులను సమాయత్తం చేస్తున్నట్లు ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ తెలిపింది. పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బకాయిలతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కారం చూపాలని కోరుతోంది. చర్చలకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం వస్తుందన్న ఆశాభావంతో ఉన్నట్లు ఏపీజేఏసీ వర్గాలు తెలిపాయి. సమస్యలు పరిష్కారం కాకపోతే ఇప్పటికే ప్రకటించిన ఉద్యమ కార్యాచరణను కొనసాగించేందుకు ఉద్యోగులను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నాయి.

## ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు : మంత్రి కందుల దుర్గేష్



- సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన పర్యాటక శాఖ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ సమావేశం
- పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా సుదీర్ఘ చర్చ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పర్యాటక రంగానికి మరింత ఊతమిచ్చేలా వినూత్న కార్యక్రమాలు, మెగా, జిల్లా స్థాయి ఈవెంట్లను నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అధికారులను ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలోని రెండవ బ్లాక్‌లో మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగిన టూరిజం డిపార్ట్‌మెంట్ మార్కెటింగ్ కమిటీ ప్రమోషన్ మీటింగ్ లో ఏడాదంతా పర్యాటక శోభ ఉట్టిపడేలా జిల్లా స్థాయి పర్యాటక ఉత్సవాలు, రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు.. జిల్లాల నుండి అందిన 28 ప్రతిపాదనలకు అనుగుణంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించేలా ఉత్సవాలకు రూపకల్పన చేయాలన్నారు. సెప్టెంబర్ 27న 'వరల్డ్ టూరిజం డే' వేడుకల నిర్వహణ, రాబోయే గోదావరి పుష్కరాలకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు, భక్తుల సౌకర్యార్థం పర్యాటక శాఖ తరఫున అత్యాధునిక టెంట్ సిటీల ఏర్పాటుపై చర్చించారు. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గోదావరి పుష్కరాలు-2027 సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో దేశవిదేశాల నుంచి తరలివచ్చే కోట్లాది మంది భక్తులు, పర్యాటకుల కోసం రూపొందించిన విస్తృత స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యాచరణను అధికారులు మంత్రి దుర్గేష్ కు అందించారు. యాత్రికుల సౌకర్యార్థం పిలిగ్రిమ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, సర్క్యూట్ మ్యాప్స్, ఆకర్షణీయమైన బ్రోచర్లు, సమగ్ర వివరాలతో కూడిన కంటెంట్ తయారు చేయాలని సూచించారు. గోదావరి నది ప్రాశస్త్యాన్ని,పరివాహక అధ్యాత్మిక ప్రాంతాల ప్రాధాన్యతను, చారిత్రక ఘాట్ల విశిష్టతను చాటేలా వినూత్న డిజిటల్ కంటెంట్, సోషల్ మీడియా ప్రచారాలు, స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు రూపొందించాలన్నారు. టూర్ ఆపరేటర్లతో ప్రతి నెలా క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించడం, హోటల్ అండ్ హాస్పిటాలిటీ వర్క్‌షాప్‌ల ఏర్పాటుపై అధికారులు సూచించగా మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలను తక్షణమే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎస్.ఎస్. రావత్, టూరిజం ఎండీ పట్టాన్‌శెట్టి రవిసుభాష్, సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్, సినిమాటోగ్రఫీ ఎండీ విశ్వనాథన్, ఏపీటీఏ సీఈవో శ్రీనివాస్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రేగుళ్ల మల్లిఖార్జునరావు, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ విజయలక్ష్మి, చీఫ్ మార్కెటింగ్, ఫైనాన్స్ అధికారులు పద్మారాణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో బాబూమోహన్ భేటీ



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో సినీ నటుడు బాబూమోహన్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ కార్యక్రమాలు, రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై ఇరువురూ చర్చించారు.

ఈ సందర్భంగా బాబూమోహన్‌ను పీవీఎన్ మాధవ్ సత్కరించారు. అలాగే బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సారథ్యం యాత్ర'కు సంబంధించిన సంచికను ఆయనకు అందజేశారు. పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై కూడా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుకు రూ.100 కోట్ల గ్రాంట్

- 'కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ధన్యవాదాలు
- 'రూ.9.94 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాథమిక పనులు త్వరలో ప్రారంభం
- 'రూ.100 కోట్లతో 100 పడకలతో సంస్థ ఏర్పాటు
- మంత్రి సత్యకుమార్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా--ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయి. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి ద్వారా 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు

ఇశీదుకు తగ్గట్లు సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమి, రహదారి, డ్రెయినేజీ, స్థల సమతలీకరణ తదితర ప్రాథమిక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.94 కోట్లను మంజూరు చేసినశీదున తదుపరి పనుల్లో మరిశీత పెరుగుతుందని చెప్పారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన పనులపై రాష్ట్ర, జిల్లా అధికారులు, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి, కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులతో ఆగస్టు 4న సంయుక్తశీగా పరిశీలించారు. స్థల అనుకూలత, మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం పలు నిర్ణయాలు తీసుకున్నారు. అంగీకరించిన పనులను మూడు నెలల్లో పూర్తి చేసి భూమిని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతికు అప్పగించేలా చర్యలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**రూ.9.94 కోట్లతో ప్రాథమిక పనులు**

మంజూరైన రూ.9.94 కోట్లలో రూ.6.74 కోట్లు భూసంబంధిత అవసరాలకు, రూ.3.20 కోట్లు స్థల నింపుదల, సమతలీకరణకు కేటాయించారు. ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్‌హెచ్--16 స్థాయి కంటే 2--3 మీటర్ల మేర దిగువన ఉండటంతో అవసరమైన మేరకు నాణ్యమైన మట్టితో నింపి నిర్దేశిత స్థాయికి తీసుకురానున్నారు. వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటశీకశీ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సంస్థకు నేరుగా చేరుకునేలా జాతీయ రహదారి-16 నుంచి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి మీదుగా 40 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు.

**కేంద్రం నుంచి రూ.100 కోట్ల గ్రాంట్**

కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ రూ.100 కోట్ల గ్రాంట్ అందించనుంది. సంస్థకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉండటంతో, ప్రస్తుతం సంస్థ ఏర్పాటు కోసం అవసరమైన ప్రాథమిక పనులను చేపడుతోంది.

ఆగస్టు 24న సంయుక్త తనిఖీలో తీసుకున్న నిర్ణయాలకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆగస్టు 25 న కేంద్రం రాష్ట్ర ఆయుష్ శాఖ డైరెక్టర్‌కు రాసిన లేఖలో నడింపాలెంలో 100 పడకల ఆసుపత్రితో కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుకు భూమిని స్వీకరించి తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. అంగీకరించిన పనులన్నీ మూడు నెలల్లో పూర్తిచేయాలని కోరింది. గుంటూరు నగరానికి సమీపంలో, ఎన్‌హెచ్-16కు ఆనుకుని సంస్థ ఏర్పాటు కానుండటంతో రాకపోకలు సులభతరం కానున్నాయి. అప్రోచ్ రోడ్డు, బస్‌స్టాప్ వంటి సదుపాయాలతో ప్రజలకు అందుబాటు మెరుగుపడనుంది. ప్రాథమిక పనులు పూర్తయిన అనంతరం భూమిని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతికు అప్పగించే ప్రక్రియ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత సంస్థ నిర్మాణానికి సంబంధించిన తదుపరి చర్యలు ప్రారంభమవుతాయి. నిర్మాణం పూర్తయితే 2028 నాటికి కేంద్ర యోగా-ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ కార్యకలాపాలు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఆయుష్ కమీషనర్ గోపాలకృష్ణ తెలిపారు.

**ప్రత్యేక చికిత్సలు:** 100 పడకల ఇన్‌పేషెంట్ ఆస్పత్రి, బహుళ విభాగాల పరిశోధనా కేంద్రంగా దీనిని అభివృద్ధి చేయనున్నారు. పురుషులు, మహిళలకు ప్రత్యేక సాధారణ, ప్రత్యేక వార్డులు ఉంటాయి. ఔట్ పేషెంట్ విభాగంలో వైద్య సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలు, జీవనశైలి, ఆహార సలహాలు, ఫాలోఅప్, నివారణాత్మక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. అవసరాన్ని బట్టి రోగులను ఇన్‌పేషెంట్‌గా చేర్చి చికిత్స అందించడం, ల్యాబ్ పరీక్షలు లేదా అవసరమైన ఇతర వైద్య సంస్థలకు రిఫర్ చేయడం జరుగుతుంది. మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, కీళ్ల వ్యాధులు, దీర్ఘకాలిక నొప్పులు, జీర్ణ-శ్వాసకోశ సమస్యలు, ఒత్తిడి, ఆందోళన, నిద్ర సమస్యలు, మహిళల ఆరోగ్య సమస్యలు, నాడీ సంబంధిత పునరావాస పరిస్థితులకు చికిత్స అందిస్తారు.

పురుషులు, మహిళలకు వేర్వేరు నేచురోపతి చికిత్సా విభాగాల్లో హైడ్రోథెరపీ, మసాజ్, మడ్ థెరపీ, మడ్ బాత్, స్టీమ్-సౌనా, హిప్, స్పైనల్ బాత్‌లు, ప్యాక్స్, కంప్రెస్‌లు తదితర చికిత్సలు ఉంటాయి. ఫిజియోథెరపీ, ఆక్యుపంక్చర్, యోగా సేవలు కూడా అందుబాటులో ఉంటాయి. పురుషులు, మహిళలకు ప్రత్యేక యోగా హాళ్లలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా నిద్ర, యోగిక్ క్రియాలు నిర్వహిస్తారు.

రోగుల ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక నేచురోపతి డైట్ కిచెన్ ద్వారా చికిత్సా ఆహారం అందిస్తారు. సుమారు 300 మంది సామర్థ్యంతో కాన్ఫరెన్స్ హాల్, వాకింగ్ ట్రాక్‌లు, ఔషధ మొక్కలు, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం ఏర్పాటు చేయనున్నారు.

**పరిశోధన, ఉపాధికి ప్రాధాన్యం**

హెమటాలజీ, బయోకెమిస్ట్రీ, న్యూరో-సైకోఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ ప్రయోగశాలలతో యోగా-నేచురోపతిపై శాస్త్రీయ పరిశోధనలు, క్లినికల్ అధ్యయనాలు చేపడతారు. సుమారు 100-120 మందికి ప్రత్యక్ష ఉపాధి, 15-20 మంది బీఎన్‌వైఎస్ వైద్యులు సహా వివిధ నిపుణులకు అవకాశాలు లభించనున్నాయి. ఆరోగ్య శిబిరాలు, యోగా, ప్రజా అవగాహన కార్యక్రమాలతో గుంటూరుతోపాటు రాష్ట్ర ప్రజలకు సమగ్ర యోగా-నేచురోపతి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

## రైతు భూమికి ప్రభుత్వ భరోసా : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

- అమృతలూరులో 1,836 మంది రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు
- 'మీ భూమి-మీ హక్కు'కు మరింత భరోసా: ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**అమృతలూరు(జర్నలిస్ట్ ఫైల్):** రైతుల భూ హక్కులకు మరింత భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో భాగంగా అమృతలూరు గ్రామంలో రీసర్వే పూర్తయిన 1,836 మంది అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. అమృతలూరు ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పాస్‌పుస్తకాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల భూ హక్కుల పరిరక్షణ, భూ రికార్డుల్లో పారదర్శకత, భూ వివాదాల నివారణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. 'మీ భూమి--మీ హక్కు' అనే నినాదంతో వ్యక్తిగత ఫొటోలు లేకుండా కేవలం ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించడం ద్వారా రైతుల భూ హక్కులకు ప్రభుత్వం నిష్పక్షపాతంగా భరోసా కల్పిస్తోందని తెలిపారు.

రీసర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో స్పష్టత ఏర్పడటంతో భవిష్యత్తులో భూ సంబంధిత వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకాల ద్వారా రైతులకు బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు, వ్యవసాయంతో పాటు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.

**అమృతలూరు మండలంలో రీసర్వేకు వేగం**

అమృతలూరు మండలంలోని 13 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ దశలవారీగా కొనసాగుతోంది. ఇప్పటికే బోడపాడు, ఎలవర్రు, కోరుటాడిపర్రు, పెదపూడి గ్రామాల్లో రీసర్వే అనంతరం 2,448 పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పూర్తయింది. తాజాగా అమృతలూరులో 1,836 పాస్‌పుస్తకాల పంపిణీతో మండలంలో ఇప్పటివరకు పంపిణీ చేసిన పాస్‌పుస్తకాల సంఖ్య 4,284కు చేరింది. గోవాడ గ్రామంలో రీసర్వే పూర్తికాగా, అక్టోబరులో సుమారు 1,950 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. పాపర్ల, మోపర్రు, తురుమెళ్ల గ్రామాల్లో రీసర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇంటూరు, పాంచాలవరం గ్రామాల్లో తదుపరి దశ పనులు చేపడుతున్నారు. మూలపాలెం గ్రామంలో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయి. కూచిపూడి గ్రామంలోనూ త్వరలో రీసర్వే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు**

రైతులు భూ హక్కులకు సంబంధించిన పత్రాల కోసం ఇబ్బందులు పడకుండా గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకు రావడం ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రీసర్వే ప్రక్రియను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి అర్హులైన రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు అందుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తూ భూముల యాజమాన్య వివరాల్లో స్పష్టత రావడం తమకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్డీఏ సమన్వయ కమిటీ కీలక సమావేశం నిర్వహించింది. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన కార్యాచరణ, భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశంలో పాల్గొన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పీవీఎన్ మాధవ్ సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు సూచించారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా మూడు భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. స్థానిక స్థాయిలో తలెత్తే సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించుకుంటూ ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

# శక్తివంతమైన ప్రధాని మోదీ సారథ్యంలో... భారత్ బలమైన ఆర్థిక వృద్ధి

- ప్రపంచ ఆర్థిక మందగమనంలో భారత్ వృద్ధి పథం మార్గదర్శకం
- 7.8 శాతం త్రైమాసిక జీడీపీ వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనం
- బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ డా. కిలారు దిలీప్



**విజయవాడ, సెప్టెంబరు 3:** లిలి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమన పరిస్థితులను ఎదుర్కొంటున్నప్పటికీ, శక్తివంతమైన ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో భారతదేశం బలమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తూ ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జ్ డా. కిలారు దిలీప్ అన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (ఏప్రిల్--జూన్ 2026)లో భారతదేశ వాస్తవ జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందడం గొప్ప మైలురాయిగా పేర్కొన్నారు. తాజా అధికారిక గణాంకాల ప్రకారం వాస్తవ జీడీపీ రూ.81.36 లక్షల కోట్లుగా ఉండగా, నామమాత్ర జీడీపీ 10.3 శాతం, వాస్తవ జీవీఏ 8.2 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు. తయారీ రంగం 9.2 శాతం, సేవల రంగం 10 శాతం, ప్రైవేట్ పెట్టుబడులు 11.9 శాతం, ప్రైవేట్ వినియోగం 7.1 శాతం, ఎగుమతులు 12 శాతం వృద్ధి చెందడం ఆర్థిక వ్యవస్థలోని వివిధ రంగాలు సమష్టిగా బలపడుతున్నాయనడానికి నిదర్శనమన్నారు. 2026లో ప్రపంచ ఆర్థిక వృద్ధి సుమారు 3 శాతంగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేస్తున్న నేపథ్యంలో భారత్ త్రైమాసిక వృద్ధి రేటు 7.8 శాతంగా ఉండటం దేశ ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను ప్రతిబింబిస్తోందని తెలిపారు.

భారత వృద్ధి కేవలం ఒక రంగంపై ఆధారపడకుండా తయారీ, సేవలు, పెట్టుబడులు, వినియోగం, ఎగుమతులు వంటి అనేక రంగాల నుంచి మద్దతు పొందుతోందని డా. కిలారు దిలీప్ పేర్కొన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు 11.9 శాతం పెరగడం పెట్టుబడి చక్రం బలపడుతున్న సంకేతమని, 7.1 శాతం ప్రైవేట్ వినియోగ వృద్ధి దేశీయ మార్కెట్ సామర్థ్యాన్ని చాటుతోందన్నారు. 7.8 శాతం వృద్ధి ఆర్‌బీఐ అంచనా వేసిన 7 శాతం, ఆర్థికవేత్తల సుమారు 7.1 శాతం అంచనాలను మించి నమోదైందని తెలిపారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన ధరల అనిశ్చితి, ప్రపంచ వాణిజ్యంలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ భారత్ వృద్ధిని కొనసాగించడం ఆర్థిక వ్యవస్థ బలాన్ని తెలియజేస్తోందన్నారు. అయితే భారత్ క్యూ1 వృద్ధి వార్షిక ప్రాతిపదికన నమోదైన త్రైమాసిక వృద్ధి రేటు కాగా, లిలిఐఎంఎఫ్‌లిలి 3 శాతం ప్రపంచ వృద్ధి అంచనా పూర్తి సంవత్సరానికి సంబంధించినదని, కాబట్టి ఈ రెండింటిని నేరుగా సమాన గణాంకాలుగా కాకుండా భారత్ వృద్ధి వేగాన్ని వివరించే సూచికలుగా చూడాలని స్పష్టం చేశారు. భారత్ ప్రపంచ వృద్ధిలో కేవలం భాగస్వామి మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలక చోదక శక్తిగా ఎదుగుతోందని డా. కిలారు దిలీప్ పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై ఉద్యమ కార్యాచరణకు గుంటూరు జిల్లా ఏపీ జేఏసి సమావేశం

- రాష్ట్ర జేఏసీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణకు రూపకల్పన




**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) రాష్ట్ర చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ పిలుపు మేరకు గురువారం గుంటూరు ఎన్జీవో రిక్రియేషన్ హాల్‌లో జిల్లా జేఏసీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నెల 5న జరగనున్న రాష్ట్ర జేఏసీ కార్యవర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై వివిధ ఉద్యోగ సంఘాల నాయకుల అభిప్రాయాలను సేకరించారు. ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీ గడువు మూడేళ్లు దాటిన నేపథ్యంలో వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏలను విడుదల చేయాలని, సరెండర్ లీవ్ నగదు చెల్లింపులు చేపట్టాలని, పెన్షనర్లకు అదనపు క్వాంటం పెన్షన్ విడుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు కల్పించాలని, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో రాష్ట్ర జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ పిలుపు మేరకు చేపట్టే ఉద్యమ కార్యాచరణకు పూర్తి మద్దతు ఇస్తామని వివిధ సంఘాల నాయకులు తెలిపారు.

గడచిన రెండేళ్లలో ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల్లో చాలా వరకు చెల్లించిందని, మంత్రివర్గ ఉపసంఘంతో చర్చల అనంతరం నెల రోజులకు పైగా వేచి చూసినా ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోవడంతో జిల్లా జేఏసీ సమావేశం నిర్వహించినట్లు చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా జేఏసీ కన్వీనర్ మొహమ్మద్ ఖాలీద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ మాట్లాడుతూ కొన్ని సంఘాలు సరైన ప్రణాళిక లేకుండా తొందరపాటు చర్యలకు పాల్పడటం వల్ల ప్రభుత్వం, ఉద్యోగ సంఘాల మధ్య కొంత ప్రతిష్టంభన ఏర్పడిందన్నారు.

ఈ నెల 5న జరిగే రాష్ట్ర జేఏసీ సమావేశం ద్వారా దీనిపై స్పష్టత వస్తుందని తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలపై కొంతమంది రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, వాటిని ఉపసంహరించుకోవాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర జేఏసీ ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేసిన ప్రయత్నాలు, కృషి, ప్రసంగాలకు సంబంధించిన వీడియోలను స్క్రీన్‌పై ప్రదర్శించారు. జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామకృష్ణ (పీఆర్‌టీయూ), షేక్ బాజీ (ఎస్‌టీయూ), షేక్ ఫైజుల్లా (డీటీఎఫ్), రబ్బానీ, ఆంజనేయులు (ట్రెజరీ), కె. కృష్ణయ్య (పెన్షనర్ సంఘం), జిల్లా జేఏసీ నాయకులు సుకుమార్, సయ్యద్ జానీబాషా, అనిల్, విజయ్, నగర అధ్యక్ష కార్యదర్శులు కళ్యాణ్ కుమార్, కోటేశ్వరరావు, తాజున్నిసా, శ్రీవాణి (మహిళా విభాగం), ప్రొహిబిషన్ ఎక్సైజ్ కానిస్టేబుల్స్ రాష్ట్ర నాయకుడు మార్పు కోటయ్య, పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ సుభాని, నర్సింగ్ అసోసియేషన్, నాలుగో తరగతి ఉద్యోగ సంఘం, వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467